తెలంగాణవ్యాప్తంగా చలితీవ్రత





PCW తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd


ఢిల్లీ పేలుడు ఘటనలో కీలక పరిణామం





Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 02 సంచిక - 325 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- మంగళవారం 18 నవంబర్ 2025




**డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొన్న టూరిస్ట్ బస్సు**

**బతికి బయటపడ్డ ఒకే ఒక్కడు**

**మృతులంతా హైదరాబాద్ పాతబస్తీ వాసులు**

**మక్కాకు వెళుతుండగా ప్రమాదం**



## సౌదీ అరేబియాలో ఘోర
# బస్సు ప్రమాదం

**మంటలు చెలరేగడంతో 46 మంది మృత్యువాత**

**హైదరాబాద్,నవంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** సౌదీ అరేబియాలో ఘోర విషాద ఘటన చోటుచేసుకుంది. మదీనాకు సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 45 మంది హైదరాబాదీలు మృతిచెందారు. యాత్రికులతో వెళ్తోన్న బస్సు.. డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొనడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. సౌదీ అరేబియాలో సోమవారం తెల్లవారుజామున ఈ ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మదీనాకు సమీపంగా భారీ రోడ్డు ప్రమాదం సంభవించింది. మక్కా నుంచి మదీనా వెళుతున్న యాత్రికుల బస్సు డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొట్టడంతో మంటలు చెలరేగి పెద్ద దుర్ఘటన చోటుచేసుకుంది. ఈమంటల్లో హైదరాబాద్‌కు చెందిన 45 మంది యాత్రికులు ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ తెలిపిన వివరాల ప్రకారం 54 మంది యాత్రికుల బృందం నవంబర్ 9 న హైదరాబాద్ నుంచి జెడ్డాకు బయలు దేరింది. నవంబర్ 23 వరకు టూర్‌ను ప్లాన్ మిగతా2లో...

## డిసెంబర్ రెండోవారంలో
# స్థానిక ఎన్నికలు

- ప్రజాపాలన వారోత్సవాల అనంతరం నోటిఫికేషన్
- కేబినేట్‌లో మంత్రులతో చర్చించిన సిఎం రేవంత్
- ప్రజాపాలన వారోత్సవాల్లో గ్రామాల్లో పెద్ద ఎత్తున ప్రచారం




**హైదరాబాద్,నవంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** స్థానిక సంస్థల ఎన్నికలపై తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రజాపాలన వారోత్సవాల తర్వాత ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించింది. డిసెంబర్ 1 నుంచి 9 వరకు ప్రజాపాలన వారోత్సవాలు నిర్వహించనున్నారు. ఆ తర్వాత ఎప్పుడైనా ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది. మరోవైపు సౌదీ అరేబియాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం చెల్లించాలని కేబినెట్ నిర్ణయించింది. మంత్రి అజారుద్దీన్, ఎంఐఎం ఎమ్మెల్యే, మైనార్టీ విభాగానికి చెందిన ఓ అధికారితో కూడిన ప్రభుత్వ ప్రతినిధి బృందాన్ని వెంటనే సౌదీకి పంపించాలని సూచించింది. మిగతా2లో...

## ఐ బొమ్మ రవితో సినీ పరిశ్రమకు
# తీరని నష్టం

**రవి హార్డ్ డిస్క్‌లో 21వేలకు పైగా సినిమాలు**

**బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేసేలా పైరసీ**

**పైరసీ ద్వారా 20కోట్లు సంపాదించిన రవి**

**3 కోట్లు అకౌంట్‌లో ఫ్రీజ్ చేశామన్న సిపి సజ్జన్నారు**

**కమిషనర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపిన సినీ పెద్దలు**



**హైదరాబాద్,నవంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** పైరసీతో సినీ పరిశ్రమకు భారీ నష్టం కలిగిందని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సజ్జన్నార్ అన్నారు. పైరసీని అరికట్టే క్రమంలో ఐ బొమ్మ రవిని అరెస్ట్ చేశామన్నారు. ఐ బొమ్మ రవిపై మూడు పైరసీ కేసులున్నాయని తెలిపారు. రవి.. వెబ్ సైట్ డిజైన్, డెవలపింగ్‌లో ఆరితేరాడని, సీక్రెట్ కెమెరాలతో కొత్త మిగతా2లో...



## పది మంది ఎమ్మెల్యేల
# అనర్హతపై విచారణ

**స్పీకర్ తీరును తప్పుపట్టిన సుప్రీం**

**నాలుగు వారాల్లో నిర్ణయం ప్రకటించాలని ఆదేశం**

**న్యూఢిల్లీ,నవంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ స్పీకర్ తీరుపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎమ్మెల్యేల అనర్హతపై మీరు నిర్ణయం తీసుకుంటారా? మేము తీసుకోవాలా ? అని సుప్రీంకోర్టు తెలంగాణ స్పీకర్‌ను ప్రశ్నించింది. ఎమ్మెల్యేల ఫిరాయింపు వ్యవహారంలో కోర్టుధిక్కర పిటిషన్‌పై తెలంగాణ స్పీకర్‌కు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై మిగతా2లో...

## దేశంలో ఉగ్రచర్యలకు
# పాల్పడే వారిని వదలం

**● పాతాళంలో దాక్కున్నా పట్టుకుని శిక్షిస్తాం ● హోంమంత్రి అమిత్ షా హెచ్చరిక**



**న్యూఢిల్లీ,నవంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఢిల్లీ కారు పేలుడు నిందితులకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా మాస్ వార్నింగ్ ఇచ్చారు. ఢిల్లీ పేలుళ్ల నిందితులను ఎక్కడున్నా వదిలిపెట్టే ప్రసక్తే లేదని.. పాతాళంలో ఉన్నా వేటాడి పట్టుకొచ్చి మరీ కఠిన శిక్షలు పడేలా చేస్తామని హెచ్చరించారు. సోమవారం హరియాణా లోని ఫరిదాబాద్‌లో జరిగిన నార్తరన్ జోనల్ కౌన్సిల్ సమావేశంలో అమిత్ షా పాల్గొన్నారు. ఢిల్లీ పేలుళ్లలో ప్రాణాలు కోల్పోయిన వారికి రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఉగ్రచర్యలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టమని వార్నింగ్ ఇచ్చారు. ప్రధాని మోడీ నాయకత్వంలో ఉగ్రవాదాన్ని మూలాల నుంచి నిర్మూలిస్తామని పునరుద్ఘాటించారు. 2025, నవంబర్ 11న భారీ పేలుడుతో దేశ రాజధాని ఢిల్లీ ఒక్కసారిగా ఉలిక్కిపడిన విషయం తెలిసిందే. ఎర్రకోట మెట్రో స్టేషన్ సమీపంలోని ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర ఓ కారులో భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో 15 మంది మృతి చెందగా.. పదుల సంఖ్యలో ప్రజలు గాయపడ్డారు. యావత్ దేశాన్ని కుదిపేసిన ఈ ఘటనను ఉగ్రదాడిగా ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం.. కేసు విచారణను జాతీయ దర్యాప్తు సంస్థ ఎన్ఐఏకి అప్పగించింది. ఈ కేసును ప్రతిష్టాత్మకంగా మిగతా2లో...



## 19న పుట్టపర్తికి
# ప్రధాని మోడీ రాక

**అమరావతి,నవంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** పుట్టపర్తి సత్యసాయిబాబా జయంతి వేడుకలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. 19న పుట్టపర్తిలో ప్రధాని మోదీ పర్యటన నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసింది. భక్తులకు ఏర్పాట్లు, రవాణా సౌకర్యాల కోసం ముగ్గురు ఐఏఎస్ అధికారులను నియమించింది. గోపాలకృష్ణ, గోవిందరావు, కల్యాణ్ చక్రవర్తికి పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించింది. అంతేకాకుండా సమీప జిల్లాలకు చెందిన జేసీ, 9 మంది డిప్యూటీ కలెక్టర్లకు అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు.

## సౌదీ ప్రమాదంలో విద్యానగర్‌లో విషాదం

**- ఒకే కుటుంబానికి చెందిన 18మంది మృతి**




కుటుంబీలకు కిషన్ రెడ్డి, పిసిసి చీఫ్‌ల పరామర్శ



## ప్రమాద మృతుల కుటుంబాలకు
# 5లక్షల ఎక్స్‌గ్రేషియా

**● అజారుద్దీన్ నేతృత్వంలో సౌదీకి ప్రభుత్వ బృందం ● తెలంగాణ కేబినేట్ కీలక నిర్ణయం**

**హైదరాబాద్,నవంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** సౌదీ అరేబియా బస్సు ప్రమాదంలో మరణించిన కుటుంబాలకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. మృతుల కుటుంబాలకు రూ.5లక్షలు చొప్పున పరిహారం ఇవ్వాలని నిర్ణయించింది. సోమవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ సమావేశమైంది. బాధితులకు అండగా నిలవాలని ఈ భేటీలో ప్రభుత్వం నిర్ణయం తీసుకొంది. మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్, ఎంఐఎం ఎమ్మెల్యేతోపాటు మైనార్టీ విభాగానికి చెందిన ఉన్నతాధికారితో కూడిన ప్రభుత్వ ప్రతినిధి బృందాన్ని సౌదీకి పంపాలనీ కేబినెట్ నిర్ణయించింది. బస్సు ప్రమాదంలో మరణించిన వారి మృతదేహాలకు మత సంప్రదాయం ప్రకారం అక్కడే అంత్యక్రియలు నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. బాధిత కుటుంబసభ్యులకు చెందిన ఒక్కో కుటుంబం నుంచి ఇద్దరిని సౌదీ తీసుకెళ్లేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ నిర్ణయం తీసుకుంది. సౌదీలో సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో 45 మంది మరణించారు. వీరంతా హైదరాబాద్ వాసులని తెలంగాణ హజ్ కమిటీ ఒక ప్రకటన వెల్లడించింది. మృతుల్లో 17 మంది పురుషులు, 18 మంది మహిళలు, 10 మంది చిన్నారులు ఉన్నారని తెలిపింది. హైదరాబాద్‌లోని మొత్తం 4 ట్రావెల్ ఏజెన్సీల ద్వారా నవంబర్ 9వ తేదీన వీరంతా ఉమ్రాకు బయలుదేరి వెళ్లారు. క్కా యాత్ర పూర్తి చేసుకుని వారంతా మిగతా2లో...



## సింగరేణి ఉద్యోగుల కోసం
# పోరాటం

- డిపెండెంట్ ఉద్యోగాలను కాపాడుకోవాలి
- డిసెంబర్ 13న సిఎండి కార్యాలయ ముట్టడి
- ఖమ్మం జాగృతి బాటలో కవిత వెల్లడి

**ఖమ్మం,నవంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** డిపెండెంట్ ఉద్యోగాలు కాపాడుకోలేని స్థితిలో ఇప్పుడు ఉన్నామని జాగృతి అధ్యక్షురాలు కవిత వ్యాఖ్యలు చేశారు. డిసెంబర్ 13న సింగరేణి సీఎండీ కార్యాలయాన్ని ముట్టడి చేయబోతున్నామని ఖమ్మం జిల్లాలో జాగృతి బాటలో కవిత ప్రకటించారు. సింగరేణి ఉద్యోగం ఒక కుటుంబానికి ఇన్సూరెన్స్ లాంటిదని... డిపెండెంట్ ఉద్యోగాల మిగతా2లో...

PCW తెలుగు దినపత్రిక

మంగళవారం 18 నవంబర్ 2025

# ఐ బొమ్మ రవితో సినీ పరిశ్రమకు తీరని నష్టం

(మొదటి పేజీ తరువాయి)

సినిమాలను పైరసీ చేస్తాడని తెలిపారు. దమ్ముంటే పట్టుకోండి అంటూ పోలీసులకు ఛాలెంజ్ చేసిన ఐ బొమ్మ రవి ప్రస్తుతం జైల్లో ఊచలు లెక్కపెడుతున్నాడు. రవి అరెస్ట్‌పై సీపీ సజ్జనార్ సినీ ప్రముఖులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పైరసీపై సంచలన విషయాలు బయటపెట్టారు. ఐ బొమ్మ రవి హార్డ్ డిస్క్ లలో దాదాపు 21 వేలకు పైగా సినిమాలు ఉన్నాయని తెలిపారు. పైరసీ ద్వారా రవి రూ. 20 కోట్లు సంపాదించాడని, అందులో రూ. 3 కోట్లు ఫ్రీజ్ చేశామని చెప్పారు. రవికి ఇంటర్నేషనల్ లింక్స్ ఉన్నాయని, ఈ కేసు ఛేధించేందుకు జాతీయ స్థాయి సంస్థల సహకారం తీసుకుంటామని స్పష్టం చేశారు. ఐ బొమ్మ రవి దగ్గర 50 లక్షల మంది సమాచారం ఉందని వెల్లడించారు. డేటా కలెక్షన్ కోసం ఐ బొమ్మ రవి మాస్టర్ మైండ్ ఉపయోగించాడని సీపీ వివరించారు. ఒక సైట్‌ను బ్లాక్ చేస్తే.. మరో సైట్‌ను డెవలప్ చేస్తాడని వెల్లడించారు. రవి సైట్ ఓపెన్ చేయగానే బెట్టింగ్ యాప్స్ అట్రాక్ట్ చేస్తాయని, బెట్టింగ్ యాప్స్‌తో జనం వేల కోట్లు నష్టపోయారని వ్యాఖ్యానించారు. కస్టడీకి ఇస్తే ఐ బొమ్మ రవి నుంచి పూర్తి వివరాలు రాబడుతామని, ఆయన నెట్‌వర్క్‌లో ఉన్న మిగతా వారిని కూడా అరెస్ట్ చేస్తామని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు. ఇదిలావుంటే సోమవారం హైదరాబాద్ నగర సీపీ సజ్జనార్‌తో సినీ పెద్దలు భేటీ అయ్యారు. అగ్ర కథానాయకులు చిరంజీవి, నాగార్జునలతో పాటు దర్శకుడు రాజమౌళి, నిర్మాత దిల్‌రాజు, దగ్గుబాటి సురేశ్ ఈ భేటీలో పాల్గొన్నారు. ఇటీవల పైరసీ వెబ్‌సైట్ ఐబొమ్మ నిర్వాహకుడు ఇమ్మడి రవిని హైదరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సినీపెద్దలు సజ్జనార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సజ్జనార్ మీడియాతో మాట్లాడారు. పైరసీతో సినీ రంగానికి చాలా నష్టం జరిగిందని తెలిపారు. దీన్ని కట్టడి చేయడంలో భాగంగా ఐబొమ్మ నిర్వాహకుడు ఇమ్మడి రవిని అరెస్టు చేసినట్లు తెలిపారు. అతడిపై ఐటీ యాక్ట్, కాపీ రైట్ యాక్ట్ కింద మరో 4 కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. పైరసీకి సంబంధించి అంతకు ముందు ప్రశాంత్, శివరాజ్‌ను కూడా అరెస్టు చేశాం. ఇమ్మడి రవి సమాజానికి చాలా నష్టం చేకూర్చాడు. పైరసీ ద్వారా నష్టం చేయడమే కాకుండా బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేస్తున్నాడు. దీంతో చాలా మంది చనిపోయారు. ఒక వెబ్‌సైట్‌ను బ్లాక్ చేస్తే కొత్త సైట్‌ను తయారు చేశాడు. ఇలా65 మిర్రర్ వెబ్‌సైట్లు నిర్వహించాడు. 21 వేల సినిమాలు అతడి హార్డ్ డిస్క్‌లో ఉన్నాయి. 1972లో విడుదలైన గాడ్‌ఫాదర్ నుంచి మొన్న వచ్చిన ఓజీ వరకు అందులో ఉన్నాయి. రూ.20 కోట్లు పైరసీ ద్వారా సంపాదించాడు. అందులో రూ.3 కోట్లు సీజ్ చేశాం. 50 లక్షల మంది సబ్‌స్క్రైబర్ల డేటా రవి వద్ద ఉంది. ఇంత డేటా అతడి వద్ద ఉండటం ప్రమాదకరం. దీన్ని సైబర్ నేరగాళ్లు వాడుకునే అవకాశం ఉందని సజ్జనార్ వెల్లడించారు. విశాఖకు చెందిన ఇమ్మడి రవి బీఎస్సీ కంప్యూటర్స్ చదివాడు. అతడు వేరే పేర్లతో మహారాష్ట్రలో డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డులు తీసుకున్నాడు. మొదటి నుంచి నేర ప్రవృత్తితో ఉన్నాడు. సినీరంగం అప్రమత్తమై ఫిర్యాదు చేసినప్పుడు పోలీసులు అతడి వెంట పడ్డారు. దీంతో భారత పౌరసత్వాన్ని వదిలి కరేబియన్ దీవుల్లో ఉన్న సెయింట్ కిట్స్ అండ్ నెవిస్ దేశ పౌరసత్వం తీసుకున్నాడు. ఫ్రాన్స్‌లో ఉంటూ వివిధ దేశాలు తిరిగేవాడు. 2019లో ఐబొమ్మ ప్రారంభించి 21 వేల సినిమాలు పైరసీ చేశాడు. అమెరికా, స్విట్జర్లాండ్, నెదర్లాండ్స్‌లో సర్వర్లను పెట్టాడు. 110 డొమైన్స్ కొనుక్కున్నాడు. ఒకటి బ్లాక్ చేస్తే మరొకటి ఓపెన్ చేస్తూ పైరసీ సినిమాలు విడుదల చేశాడు. ఈ రాకెట్‌లో ఉన్న మిగతా వాళ్లను కూడా బయటకు తీసుకువస్తాం అని సజ్జనార్ తెలిపారు. ఇదిలావుంటే ఈ కేసులో కీలకంగా వ్యవహరించి రవిని అరెస్ట్ చేసిన పోలీస్‌లను సినీ ప్రముఖులు చిరంజీవి, రాజమౌళి తదితరులు సన్మానించారు.

# ఢిల్లీ పేలుడు ఘటనలో కీలక పరిణామం

**ఉమర్‌కు సహకరించిన అమీర్ రషీద్**

**ఎన్ఐఎ కస్టడీకి అప్పగించిన పాటియాల కోర్టు**



**న్యూఢిల్లీ,నవంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో ఇటీవల జరిగిన భారీ పేలుడు కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. పేలుడుకు పాల్పడిన ఉమర్‌కు సహకరించిన నిందితుడు అమీర్ రషీద్ అలీని కట్టుదిట్టమైన భద్రత మధ్య పాటియాలా హౌస్ కోర్టు కాంప్లెక్స్‌లోని ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టు ముందు సోమవారం నాడు హాజరుపరిచారు. ఈ మేరకు 10 రోజుల ఎన్ఐఏ కస్టడీకి కోర్టు ఆదేశించింది. ఆ వెంటనే రషీద్‌ను ఎన్ఐఏ కార్యాలయానికి అధికారులు తరలించారు. అమీర్ రషీద్ అలీని కోర్టుకు హాజరుపరిచే సమయంలో మీడియాను అనుమతించలేదు. కోర్టు కాంప్లెక్స్ చుట్టూ ఢిల్లీ పోలీసులు, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ సిబ్బంది మోహరించారు. అల్లర్ల వ్యతిరేక టీమ్‌నూ సిద్ధం చేశారు. నవంబర్ 10న జరిగిన ఢిల్లీ పేలుడు ఘటనలో 10 మంది మృతిచెందగా, 13మంది గాయపడ్డారు. ఐఈడీ అమర్చి పేల్చిన ఐ20 కారు అమీర్ పేరుతో రిజిస్టర్ కావడంతో ఎన్ఐఏ అతన్ని అదుపులోకి తీసుకుంది. సూసైడ్ బాంబర్ ఉమర్ నబీతో కలిసి ఈ దాడికి అమీర్ రషీద్ కుట్రపన్నినట్టు ఎన్ఐఏ వెల్లడించింది. అమీర్ జమ్మూకశ్మీర్‌లోని పంపోర్‌కు చెందిన వ్యక్తి కాగా, ఉమర్ ఫరీదాబాద్‌లోని అల్–ఫలాహ్ యూనివర్శిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నాడు. తదుపరి విచారణలో భాగంగా ఉమర్ ఉపయోగించిన మరో కారునూ ఎన్ఐఏ స్వాధీనం చేసుకుంది. ఇంతవరకూ గాయపడిన బాధితులతో సహా 73మంది సాక్ష్యులను ఎన్ఐఏ విచారించింది. మరోవైపు, ఫరీదాబాద్ టెర్రర్ మాడ్యూల్ కేసులో ప్రమేయం, మోసం, ఫోర్జరీకి పాల్పడిన ఆరోపణలపై అల్–ఫలాహ్ యూనివర్శిటీ చైర్మన్‌కు ఢిల్లీ పోలీసులు రెండు సమన్లు జారీ చేశారు. యూజీసీ, ఎన్ఏఏసీ లేవనెత్తిన ఆందోళనలపై రెండు ఎఫ్ఐఆర్‌లనూ నమోదు చేశారు. యూనివర్శిటీ గుర్తింపు క్లెయిమ్స్‌పై జరిపిన సమీక్షలో పెద్దఎత్తున అవకతవకలు జరిగినట్టూ గుర్తించారు.

# డిసెంబర్ రెండోవారంలో స్థానిక ఎన్నికలు

(మొదటి పేజీ తరువాయి)

చనిపోయిన వారి మృతదేహాలకు మత సంప్రదాయం ప్రకారం.. అక్కడే అంత్యక్రియలు నిర్వహించాలని నిర్ణయించింది. బిసి రిజర్వేషన్ల వ్యవహారంతో ఆగిపోయిన స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. డిసెంబర్ రెండో వారంలో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ ఉంటుందని పేర్కొంది. ప్రజాపాలన వారోత్సవాల తర్వాతే లోకల్ బాడీ ఎలక్షన్స్ ఉంటాయని మంత్రివర్గ భేటీ స్పష్టం చేసింది. డిసెంబర్ 1 నుంచి 9 వరకు తెలంగాణ ప్రజాపాలన వారోత్సవాలు జరగనున్నాయి. వారోత్సవాల సమయంలో ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కేబినెట్ నిర్ణయించింది. స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా సర్పంచ్ సహా జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. అయితే ముందుగా సర్పంచ్ ఎన్నికలు నిర్వహించాలని కేబినెట్ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. సర్పంచ్ ఎన్నికల తరవాతే జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు నిర్వహించాలని మంత్రివర్గ భేటీలో చర్చించినట్లు సమాచారం. జూబ్లీహిల్స్ ఎన్నికల ఫలితంనే లోకల్ బాడీ ఎలక్షన్‌లలో పునరావృతం చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తోంది. ఇక తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల పదవీకాలం ముగిసి 20 నెలలు పూర్తయ్యాయి. ఇటీవల బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశం తీవ్ర వివాదాస్పదమైంది. దీనిపై హైకోర్టు, సుప్రీం కోర్టు వ్యతిరేకంగా తీర్పు నిచ్చాయి. రిజర్వేషన్లు 50శాతం దాటరాదన్న నిబంధనలను పాటించాలని సూచించాయి. మొత్తానికి డిసెంబర్‌లో ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల కానుంది. సిఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన సోమవారం నాడు రాష్ట్ర సచివాలయంలో మంత్రివర్గం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అనేక అంశాలపై చర్చించారు. ముఖ్యంగా స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై చర్చించినట్లు సమాచారం.ఇప్పటికే ఎన్నికల నిర్వహణ ఆలస్యమైన నేపథ్యంలో ఇక ఆలస్యం చేయొద్దని.. వీలైనంత తర్వగా లోకల్ బాడీ ఎలక్షన్స్ నిర్వహించాలని నిర్ణయించింది మంత్రివర్గం. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు అవుతున్న నేపథ్యంలో తమ ప్రభుత్వం ప్రజల కోసం ఏం చేసిందనే విషయాన్ని ప్రజాపాలన వారోత్సవాల్లో వివరించాలని మంత్రివర్గం తీర్మానించింది. గ్రామ స్థాయిలో ప్రభుత్వ పథకాలు, ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను ప్రచారం చేసి.. లోక్‌బాడీ ఎన్నికల్లో జయకేతనం ఎగురవేయాలని నిర్ణయించింది. ప్రజాపాలన వారోత్సవాలతో గ్రామ స్థాయి కేడర్‌లో మరింత ఉత్సాహం నింపి స్థానిక ఎన్నికల్లో విజయ ఢంకా మోగించాలని భావిస్తున్నారు.

# పది మంది ఎమ్మెల్యేల అనర్హతపై విచారణ

(మొదటి పేజీ తరువాయి)

మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోక పోవడంపై కేటీఆర్ కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సోమవారం విచారణ జరిగింది. కోర్టుధిక్కారంపై నాలుగు వారాల్లోగా జవాబు చెప్పాలని స్పీకర్‌కి దేశ అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. ఈ పిటిషన్‌ను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్. గవాయి ధర్మాసనం విచారణ జరిపింది. మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోకపోవడం కోర్టు ధిక్కారమే.. రోజువారీగా విచారణ జరిపి నిర్ణయం తీసుకోవాలని జస్టిస్ బీఆర్ గవాయి స్పష్టం చేశారు. నాలుగు వారాల్లోగా విచారణ పూర్తి చేస్తామని స్పీకర్ తరఫున న్యాయవాదులు అభిషేక్ సింగ్, ముకుల్ రోహత్గి వెల్లడించారు. తెలంగాణ లో ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై సుప్రీంకోర్టులో సోమవారం విచారణ జరిగింది. ఈ అంశంపై సర్వోన్నత న్యాయస్థానం స్పీకర్‌కు మరో 4 వారాల గడువు ఇచ్చింది. ఈలోపు నిర్ణయం తీసుకోవాలని సూచించింది. కేసు విచారణను కూడా 4 వారాలకు వాయిదా వేసింది. తెలంగాణలో పదిమంది ఎమ్మెల్యేల అనర్హత అంశానికి సంబంధించి దాఖలైన మూడు వేర్వేరు పిటిషన్లు సోమవారం సుప్రీం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం ముందుకు విచారణకు వచ్చాయి. ఆ ఎమ్మెల్యేలకు వ్యతిరేకంగా భారత రాష్ట్ర సమితి దాఖలు చేసిన పిటిషన్లపై మూడునెల ల్లోపు నిర్ణయం తీసుకోవాలని జులై 31న జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం ఆదేశించి ంది. అయితే విభిన్న కారణాలవల్ల ఆలోపు నిర్ణయం తీసుకోవడం సాధ్యం కానందున స్పీకర్‌కు మరో రెండునెలలు గడువు ఇవ్వాలని కోరుతూ తెలంగాణ శాసనసభ కార్యదర్శి దాఖలు చేసిన మిసిలేనియస్ అప్లికేషన్ సీజేఐ ధర్మాసనం ముందు 14వ నంబరులో లిస్ట్ అయింది. ఈక్రమంలో ఆయా పిటిషన్లపై సోమవారం విచారణ చేపట్టిన న్యాయస్థానం స్పీకర్‌కు మరో 4 వారాల గడువు ఇచ్చింది.

# సింగరేణి ఉద్యోగుల కోసం పోరాటం

(మొదటి పేజీ తరువాయి)

కోసం పోరాటం చేస్తామన్నారు. సోమవారం సత్తుపల్లి జేవీఆర్ ఓసీ సింగరేణిలో కార్మికులతో కవిత మాట్లాడారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. రెండేళ్లుగా మెడికల్ బోర్డ్ కోసం కోట్లాడుతున్నామన్నారు. సింగరేణి గని కార్మికులకు ఇన్‌కమ్ ట్యాక్స్ కట్ చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామని.. 'మీకోసం పోరాటం చేసే మాకు అండగా ఉండాలి అని కోరుతున్నాం' అని కవిత అన్నారు. కొత్త బొగ్గు బ్లాక్‌లు సింగరేణికి అందించాలని డిమాండ్ చేశారు. కేంద్రం బొగ్గు బ్లాక్‌లను ప్రైవేట్ వ్యక్తులకు వేలం వేయడాన్ని ఒప్పుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వం సింగరేణికి అక్షరాలా రూ.40 వేల కోట్ల అప్పు ఉందని తెలిపారు. సింగరేణి కార్మికుల కోసం మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం చేయాలని కోరుతున్నామన్నారు. ఆసుపత్రి నిర్మాణం చేసే లోపు కార్పోరేట్ హాస్పిటల్స్‌లో వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికులు పెర్మినెంట్ అయ్యేలా ప్రయత్నం చేస్తామని తెలిపారు. బొగ్గు బావిలోకి దిగే ముందు మైసమ్మకు మొక్కుకుని జాగ్రత్తగా ఉండాలని కవిత సూచించారు.

# సౌదీ అరేబియాలో ఘోర బస్సు ప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. వారిలో నలుగురు ముందుగానే కారులో మదీనాకు వెళ్లగా, మరో నలుగురు మక్కాలోనే నిలిచిపోయారు. మిగిలిన 46 మంది బస్సులో ప్రయాణం కొనసాగించారు. మదీనా నుండి సుమారు 25 కిలోమీటర్ల దూరంలో బస్సు చమురు ట్యాంకర్‌ను ఢీకొట్టడంతో ఒక్కసారిగా అగ్నిప్రమాదం చెలరేగిందని తెలిపారు. డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొనగానే మంటలు చెలరేగి బస్సు మొత్తం వ్యాపించాయి. ప్రమాద సమయంలో యాత్రికులంతా నిద్రలో ఉండటంతో మృతుల సంఖ్య ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. ఘటనాస్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ ప్రమాదంలో అబ్దుల్ షోయబ్ అనే యాత్రికుడు మాత్రమే ప్రాణాలతో బయటపడ్డాడు. అతను ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మరణించిన వారిలో మల్లేపల్లి, బజార్‌ఘాట్, ఆసిఫ్‌నగర్ ప్రాంతాల వారూ ఉన్నట్లు తెలుస్తోంది. భారత కాలమానం ప్రకారం సోమవారం ఉదయం 1.30 గంటల సమయంలో ఈ ఘోర ప్రమాదం జరిగింది. యాత్రికులంతా నిద్రలో ఉండడం వల్ల మరణాలు అధికంగా నమోద య్యాయని అధికారులు భావిస్తున్నారు. ప్రమాద స్థలంలో రక్షణ చర్యలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో సౌదీ అరేబియాలోని జెడ్డా భారత దౌత్య కార్యాలయం ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు ప్రకటించింది. 24 ఏళ్ల మొహమ్మద్ అబ్దుల్ షోయబ్ డ్రైవర్ పక్కన కూర్చోవడంతో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. షోయబ్ హైదరాబాద్‌కు చెందిన వ్యక్తి. గాయాల పాలైన షోయబ్‌ను హాస్పిటల్‌లో చేర్చారు. అయితే అతడి ఆరోగ్య పరిస్థితిపై పూర్తి సమాచారం బయటకు రాలేదు . ప్రమాదంలో షోయబ్ కుటుంబ సభ్యులందరూ చనిపోయినట్టు తెలుస్తోంది.

# దేశంలో ఉగ్రచర్యలకు పాల్పడే వారిని వదలం

(మొదటి పేజీ తరువాయి)

తీసుకున్న ఏన్ఐఏ విచారణ వేగవంతం చేసింది. ఇందులో భాగంగా పలువురు నిందితులను అరెస్ట్ చేయడంతో పాటు.. అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తోంది. ఈ క్రమంలోనే ఢిల్లీ కారు పేలుడుకు సంబంధించి సోమవారం మరో వ్యక్తిని ఎన్ఐఏ అరెస్ట్ చేసింది. జమ్మూకాశ్మీర్‌కు చెందిన జాసిర్ బిలాల్ వాని అలియాస్ డానిష్?ను అదుపులోకి తీసుకున్నారు. ఢిల్లీ కారు బ్లాస్ట్ కేసులో ప్రధాన నిందితుడు, ఆత్మాహుతి బాంబర్ డాక్టర్ ఉమర్ ఉన్ నబీతో డానిష్‌కు సంబంధాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. బాంబ్ పేలుడు కోసం ఉమర్ నబీకి డానిష్ సాంకేతిక సహాయం అందించాడని.. డ్రోన్ల ద్వారా ఉగ్రవాద దాడులకు సహకరించాడని అధికారులు వెల్లడించారు.

# సౌదీ ప్రమాదంలో విద్యానగర్‌లో విషాదం

**హైదరాబాద్,నవంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** సౌదీ అరేబియాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో హైదరాబాద్‌లోని విద్యానగర్‌కు చెందిన నజీరుద్దీన్ కుటుంబంలోని 18 మంది మృతి చెందారు. దీంతో ఈ ప్రాంతంలో తీవ్ర విషాదం అలముకుంది. నజీరుద్దీన్ మృతితో స్థానికులు కన్నీరు పెట్టారు. నసీరుద్దీన్ ఓ విశ్రాంత రైల్వే ఉద్యోగి. తన కుటుంబ సభ్యులతో కలిసి మక్కా యాత్రకు వెళ్లారు. అంతలోనే ఈ ఘోర ప్రమాదం వారి కుటుంబాన్ని కబళించింది. విషయం తెలుసుకున్న నసీరుద్దీన్ బంధువులు, స్నేహితులు అతడి నివాసం వద్దకు చేరుకున్నారు. ఆ ప్రాంతంలో విషాదఛాయలు అలముకున్నాయి. బాధిత కుటుంబ బంధువులను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పరామర్శించారు. కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. ఎలాంటి అవసరం ఉన్నా తనను సంప్రదించాలని భరోసా ఇచ్చారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్.. నసీరుద్దీన్ ఇంటికి వెళ్లి ఆయన బంధువులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఇప్పటికే ఆ దిశగా చర్యలు మొదలు పెట్టినట్లు చెప్పారు. మరోవైపు నసీరుద్దీన్ ఇంటి వద్ద రోదనలు మిన్నంటాయి. ఒకే కుటుంబంలో 18 మంది ప్రాణాలు కోల్పోవడాన్ని నమ్మలేకపోతున్నామంటూ ఆయన బంధువులు, స్నేహితులు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం మేరకు 18 మంది అంత్యక్రియలను సౌదీలోనే నిర్వహించనున్నట్లు నసీరుద్దీన్ బంధువులు పేర్కొన్నారు. మరోవైపు ఇదే ప్రమాదంలో.. హైదరాబాద్ పాతబస్తీ బహదూర్‌పురాకు చెందిన ఐదుగురు మృతి చెందారు. మృతుల కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్ పరామర్శించారు. సౌదీలో సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో 45 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. వీళ్లంతా హైదరాబాద్ వాసులేనని తెలంగాణ హజ్ కమిటీ ఓ ప్రకటన విడుదల చేసింది. మృతి చెందిన వారిలో 17 మంది పురుషులు, 18 మంది మహిళలు, 10 మంది చిన్నారులు ఉన్నట్లు పేర్కొంది. మొత్తం నాలుగు ట్రావెల్ ఏజెన్సీల ద్వారా ఈనెల 9న హైదరాబాద్ నుంచి వీరంతా ఉమ్రాకు బయల్దేరారు. విజయవంతంగా మక్కా యాత్ర పూర్తిచేసుకుని మదీనాకు వెళ్తున్న సమయంలో రోడ్డు ప్రమాదం జరిగింది. మదీనాకు 25 కి.మీ దూరంలో బస్సు–డీజిల్ ట్యాంకర్ ఢీకొన్నాయి.

# ప్రమాద మృతుల కుటుంబాలకు 5లక్షల ఎక్స్‌గ్రేషియా

(మొదటి పేజీ తరువాయి)

మదీనాకి వెళ్తున్న సమయంలో ఈ రోడ్డు ప్రమాదం జరిగింది. హైదరాబాద్‌లోని విద్యానగర్‌కు చెందిన నజీరుద్దీన్ కుటుంబంలోని 18 మంది ఈ ప్రమాదంలో మరణించారు.

# తెలంగాణవ్యాప్తంగా చలితీవ్రత

**● చలిగాలులకు తోడు పొగమంచు**



**హైదరాబాద్,నవంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణవ్యాప్తంగా చలితీవ్రత పెరిగింది. ఎముకలు కొరికే చలికి జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం వేళల్లో భారీగా పొగమంచు కురుస్తున్నది. దానికి తోడు చలిగాలులు వీస్తుండడంతో జనం అల్లాడుతున్నారు. ఈ క్రమంలో వాతావరణశాఖ కీలక హెచ్చరికలు జారీ చేసింది. రాగల రెండురోజులు తెలంగాణలో అక్కడక్కడ కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే నాలుగు నుంచి ఐదు డిగ్రీల వరకు తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని అంచనా వేసింది. సోమవారం ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, నిర్మల్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ చలిగాలులు వీస్తాయని హెచ్చరించింది. మంగళవారం ఆసిఫాబాద్, ఆదిలాబాద్, నిర్మల్, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో శీతలగాలులు వీచే ఛాన్స్ ఉందని హెచ్చరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. ఆ తర్వాత రాష్ట్రంలో పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని చెప్పించింది. ఇదిలా ఉండగా.. గడిచిన 24 గంటల్లో పలుచోట్ల ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కు పడిపోయాయి. ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్‌లో అత్యల్పంగా 7.4 డిగ్రీ సెల్సియస్ కనిష్ట ఉష్ణోగ్రత నమోదైందని వాతావరణశాఖ తెలిపింది. రాగల రెండు రోజులు చలి తీవ్రత మరింత పెరుగుతుందని వాతావరణశాఖ హెచ్చరించింది. అదే సమయంలో హైదరాబాద్‌లో ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. సోమవారం ఉదయం ఈ సీజన్‌లోనే ఉష్ణోగ్రతలు కనిష్టానికి పడిపోయాయని వాతావరణశాఖ తెలిపింది. హైదరాబాద్ యూనివర్సిటీ పరిధిలో 8.8 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైందని పేర్కొంది. రాజేంద్రనగర్‌లో 10, కంటోన్మెంట్‌లో 11.2, మారేడ్‌పల్లిలో 11.5, కుత్బుల్లాపూర్‌లో 12, గచ్చిబౌలిలో 12 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు పడిపోయాయని.. సోమవారం రాత్రి సైతం చలి కొనసాగే అవకాశం ఉందని తెలిపింది. మంగళవారం ఉదయం సైతం ఇలాంటి పరిస్థితులే ఏర్పడే అవకాశాలున్నాయని హెచ్చరించింది.

# చదువుకున్న పాఠశాల కోసం పూర్వ విద్యార్థుల ఆరాటం



**- సిఎస్ఐ పాఠశాల అభివృద్ధి కోసం ఆడహాక్ కమిటీ ఎన్నిక**

**- పాఠశాల పూర్వ విద్యార్థుల కృషిని అభినందించిన పాఠశాల కరస్పాండెంట్ రమాజ్యోతి**

**పరకాల,నవంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** చదువుకున్న పాఠశాలను కాపాడుకోవడం కోసం పూర్వ విద్యార్థులంతా ముందుకు రావడం చాలా గర్వంగా ఉందని సీఎస్ఐ మిషన్ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ రమా జ్యోతి అన్నారు. సీఎస్ఐ మిషన్ ఉన్నత పాఠశాల అభివృద్ధి కోసం సిఎస్ఐ మిషన్ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ రమాజ్యోతి అధ్యక్షతన సోమవారం పూర్వ విద్యార్థులు సమావేశం కావడం జరిగింది. ఈ సమావేశం ప్రధాన ఉద్దేశం సిఎస్ఐ కరీంనగర్ అధ్యక్ష మండల మేనేజ్మెంట్ కు లోబడి పాఠశాల అభివృద్ధి - కార్యచరణ రూపొందించడం కోసం పూర్వ విద్యార్థుల నుంచి తాత్కలిక అదహక్ కమిటీని వేయడం జరిగింది. అద హక్ కమిటీ చైర్మన్ గా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎబ్బి, ముఖ్య సలహాదారులుగా కే. జే థామస్,( రిటైర్డ్ హెచ్ఎం ) ఓ. చంద్రశేఖర్ ( పి జి హెచ్ ఎం ) ఎం. జేమ్స్ ను, సి ఎస్ ఐ కరీంనగర్ అధ్యక్ష మండల మేనేజ్మెంట్కు ఎక్స్ అఫీషి యో ( ప్రత్యేక హోదా )గా పరిగణంలోకి తీసుకుంటూ ఆడహాక్ కమిటీ కన్వీనర్ గా ఒంటేరు ప్రభాకర్, కోకన్వీనర్ గా కాజీపేట రవీందర్, సెక్రటరీగా చొల్లేటి సునేందర్, కోశాధికారిగా బి. అశోక్, సలహాదారుడుగా ఒంటేరు చక్రి, కన్స్ట్రక్షన్స్ కన్వీనర్స్ గా బొచ్చు కళ్యాణ్, పాలకుర్తి తిరుపతిలను ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా కమిటీ కన్వీనర్ ఒంటేరు ప్రభాకర్ మాట్లాడుతూ 1948 సంవత్సరంలో స్థాపించి 77 సంవత్సరాలుగా వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తుకు విద్యా ద్వారా తోడ్పాటు అందించిన సీఎస్ఐ మిషన్ ఉన్నత పాఠశాల పూర్వవైభవమే పూర్వ విద్యార్థులు కృషి చేయాలని ఐక్యతగా స్వచ్ఛందంగా ముందుకు రావడం జరిగింది అన్నారు. 2026 -27 విద్యా సంవత్సరంలోపు సి ఎస్ ఐ మిషన్ ఉన్నత పాఠశాల ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే దిశగా కార్యచరణ రూపొందించాలని నిర్ణయించడం జరిగిందన్నారు. పాఠశాల అభివృద్ధికి నిధుల సేకరణ జరగాలంటే ప్రతి ఎస్ఎస్సి బ్యాచ్ వారందరినీ వాట్సప్ గ్రూపులో యాడ్ చేస్తూ.. కమిటీ తీసుకున్న నిర్ణయాలను.. పనులను తెలియజేస్తూ నిధులను సేకరించడం జరుగుతుందన్నారు. ఆయా నిధులను బ్యాంకు అకౌంట్ తీసి అందులో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. కాబట్టి సి ఎస్ ఐ పూర్వ విద్యార్థులు ఎక్కడ ఉన్నా.. ఎంతటి హోదాలో ఉన్న పాఠశాల అభివృద్ధి కోసం పాటుపడాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా వచ్చే నెల డిసెంబర్ 7న 11 గంటలకు అడహాక్ కమిటీ సమావేశమై పాఠశాల అభివృద్ధి కోసం చేపట్టాల్సిన పనులపై కార్యచరణ రూపొందించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో పాఠశాల పూర్వ విద్యార్థులు బొచ్చు అనంతరావు, ఒంటేరు మధు, బొచ్చు శ్రీనివాస్, పాస్టర్ బొచ్చు ప్రకాశం తదితరులు పాల్గొన్నారు.

# పొగమంచు కారణంగా రాత్రి, తెల్లవారుజామున ప్రయాణాలు చేయకండి

**వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్**




**హన్మకొండ,నవంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** వాతావరణంలో పొగమంచు తీవ్రత పెరగటంతో వీలైనంత వాహన దారులు రాత్రి, తెల్లవారు జామున ప్రయాణాలు చేయద్దని వరంగల్ పోలీస్ కమిషనర్ ప్రజలకు సూచించారు వాతావరణంలో పొగమంచు తీవ్రత పెరగడం కారణంగా జరిగిన రోడ్డు ప్రమాదాల నేపథ్యంలో ప్రజలను వరంగల్ పోలీస్ కమిషనర్ ప్రకటన చేస్తూ రాత్రి, తెల్లవారు జామున దట్టమైన పొగమంచు కారణంగా రహదారులపై ఎదురుగా వచ్చే వాహనాలు, పాదాచారుల ను గుర్తించడం, వీక్షించే సామర్థ్యం తక్కువుగా వుంటుంది. ఈ సమయంలో చిన్నపాటి నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదాలకు దారితీసే అవకాశాలు ఉన్నందున, ప్రజలు అత్యవసరమైతే తప్ప ఈ సమయాల్లో ప్రయాణాలను మానుకోవాలని వరంగల్ సీపీ ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు. అలాగే పొగమంచు ఎక్కువగా ఉండే సమయంలో వాహనాలు నడుపుతున్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సీపీ సూచిస్తూ వాహనాలను వేగంగా నడపొద్దని, వాహన దారులు శ్రద్ధతో, నిదానంగా ప్రయాణించాలి. తక్కువ వీక్షించే సామర్థ్యం కారణంగా ఇతర వాహనాలు, పాదచారులు, మలుపులు, రోడ్డు విభాగాలు సరిగా కనిపించక ప్రమాదాలు సంభవించే అవకాశం ఉన్నందున, హెడ్ లైట్లను లో బీమ్ లో ఉంచి, ఫాగ్ లైట్లను వాడాలని సూచించారు. అత్యవసర సమయాల్లో ప్రయాణం తప్పనిసరి అయితే వాహనాల స్థితిని ముందుగానే తనిఖీ చేసుకోవడంతో పాటు ముఖ్యంగా బ్రేకులు, లైట్లు, టైర్లు సరిగా ఉన్నాయో లేదో సరి చూసుకోవాలని డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగం, ఆకస్మికంగా ఓవర్ టేక్ చేయడం, ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘించడం వంటి ప్రమాదకరమైన చర్యలకు పాల్పడవద్దని పోలీసుల సూచనలతో పాటు ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ వాహన దారులు వారి గమ్య స్థానాలకు క్షేమంగా చేరుకోవడమే వరంగల్ పోలీస్ కమిషనర్ ప్రధాన లక్ష్యమని సీపీ వెల్లడించారు.

# ప్రజావాణి వినతుల పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలి

**హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**

**హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వినతులను స్వీకరించిన జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**

**ప్రజావాణి కార్యక్రమానికి 139 వినతులు**



**హన్మకొండ,నవంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి స్వీకరించిన వినతుల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశించారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని ప్రధాన సమావేశపు హాలులో ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డిలకు వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు వినతులను అందజేశారు. ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ, గృహ నిర్మాణ, మున్సిపల్, తదితర సమస్యలపై ప్రజలు 139 వినతులను కలెక్టర్, అదనపు కలెక్టర్లకు అందజేశారు. ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు వినతి పత్రాలను అందజేస్తూ తమ సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ను కోరగా అక్కడే ఉన్న సంబంధిత శాఖల అధికారులను వినతుల పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. పలు మండలాలకు సంబంధించిన వినతులపై పరిష్కార చర్యల నిమిత్తం తహసిల్దార్లను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్, వివిధ శాఖల జిల్లా అధికారులు, పలువురు తహసీల్దార్లు పాల్గొన్నారు.



# అయ్యప్ప స్వాముల ఇరుముడి

**సత్తుపల్లి, నవంబర్17 (పిసిడబ్ల్యూ న్యూస్) :** సత్తుపల్లి మండలం బుగ్గపాడు గ్రామంలో అయ్యప్ప స్వాముల ఇరుముడి కార్యక్రమంలో అయ్యప్ప స్వామి వారి నామస్మరణతో మారు మ్రోగింది. శ్రీ కనక దుర్గమ్మ తల్లి దేవాలయంలో సుమారు 40మంది అయ్యప్ప దీక్ష తీసుకున్న స్వాములకు ఇరుముడి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమం కందమూరి శ్రీను గురుస్వా మి, బెజవాడ బిక్షపతి గురుస్వామి ల ఆధ్వర్యంలో జరిగింది.

# తొర్రూరు శివారులో ఆకస్మికంగా వాహన తనిఖీ చేసిన ఆర్టిఏ అధికారులు





**తొర్రూర్ ప్రతినిధి,నవంబర్ 17(పిసిడబ్ల్యూ న్యూస్):** మహబూబాబాద్ జిల్లా పరిధిలో ఆర్టీఏ శాఖ అధికారులు అకస్మాత్తుగా నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో పలువురు వాహనదారుల పత్రాలను ఆర్టీఏ వెంకట్ రెడ్డి సోమవారం పరిశీలించారు. తోరూర్ పట్టణ శివారు ఖమ్మం వరంగల్ జాతీయ రహదారిపై అధిక లోడుతో ప్రయాణిస్తున్న లారీలు, ఫిట్నెస్ గడువు ముగిసిన వాహనాలు, పక్కా పత్రాలు లేని రవాణా వాహనాలపై అధికారులు కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. తనిఖీల్లో వాహన రిజిస్ట్రేషన్ పత్రాలు, ఫిట్నెస్ సర్టిఫికేట్, అనుమతిపత్రం, బీమా, డ్రైవింగ్ లైసెన్స్ వంటి వివరాలను అధికారులు పరిశీలించారు. నిబంధనలు పాటించని వాహనదారులకు చలాన్లు జారీ చేసి, కొన్నింటిని నిలిపివేసినట్లు సమాచారం. అధికారులు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు, ప్రజల భద్రత కోసం ఈ తనిఖీలు క్రమం తప్పకుండా కొనసాగుతాయని తెలిపారు. రవాణా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# బిఆర్ఎస్ కార్యకర్త కుటుంబన్ని పరామర్శ

- **డీసీఎంఎస్ చైర్మన్ రామ స్వామి నాయక్**



**ఖానాపూర్ నవంబర్ 17(పీసీడబ్ల్యూ న్యూస్):** ఖానాపూర్ మండలం అశోక్ నగర్ గ్రామానికి చెందిన గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ కార్యకర్త దేశబోయిన ప్రశాంత్ యాదవ్ అనారోగ్యంతో మృతి చెందడం జరిగింది. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ శ్రద్ధాంజలి ఘటించి నివాళులర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ డీసీఎంఎస్ చైర్మన్ గూగులోతు రామస్వామి నాయక్ వారి కుటుంబానికి 50 కేజీల బియ్యం ఇవ్వడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమంలో బిఆర్ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షులు ముచ్చ యాదగిరి రావు , మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రామ సహాయం ఉపేందర్ రెడ్డి , బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు , జినుక వెంకటయ్య , కర్ర రమేష్ , కాస్ట్రాల రమేష్, ఇరుగు దేవేందర్ రావు, జెట్టి వెంకన్న,మాజీ వార్డ్ మెంబర్స్ ముద్దంగుల సంపత్ , గోవిందు రాంబాబు, యూత్ అధ్యక్షులు నోముల నరేష్ ,మరియు నీలారపు రమేష్, బసన బోయిన యాకయ్య, బండోజు లాలు, అంగిరేకుల నాగరాజ్, ఉడుగుల రాజు యాదవ్, లెంకలపల్లి కుమార్ ముఖ్యులు పాల్గొన్నారు.

# ఆ జాగ్రత్త డ్రైవింగ్‌తో తనయుడిని కోల్పోయిన తండ్రి

**తొర్రూర్ ప్రతినిధి,నవంబర్ 17(పిసిడబ్ల్యూ న్యూస్):**మహబూబాబాద్ జిల్లా, తొర్రూరు మండలంలోని పోలేపల్లి గ్రామానికి చెందిన ధరావత్ వనిత మరియు ధరావత్ విశ్వనాథ్ కుమారుడైనటువంటి మృతుడు: ధరావత్ రామచరణ్, వయస్సు. 17 సంవత్సరాలు, తన తండ్రి అయిన ధరావత్ విశ్వనాథ్ తో, వారియొక్క TG26T1339/40 నంబర్ గల ట్రాక్టర్ పై పోలేపల్లి గ్రామ శివారులోని వారి పొలంలో గల వడ్లను తీసుకురావడం కోసం వెళ్లి, అక్కడ విశ్వనాథ్ ట్రాక్టర్‌ను అజాగ్రత్తగా నడుపుతూ, ఒడ్డు ఎక్కిస్తుండగా, ట్రాలీలో ఉన్న మృతుడు(రామ్ చరణ్) ప్రమాదవశాత్తు ట్రాలీ నుండి క్రింద పడగా, అతని మెడ మీద నుండి ట్రాక్టర్ ట్రాలీ చక్రం ( టైర్ )వెళ్లి అక్కడికక్కడే చనిపోయాడు. మృతుడి తల్లి ధరావత్ వనిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు విశ్వనాథ్ పై కేసు నమోదు చేసి పోస్టుమార్టం జరిపించడం జరిగిందని తొర్రూర్ ఎస్సై ఉపేందర్ తెలిపారు.

# విద్యార్థులకు ఆర్ట్స్ కాంపిటేషన్ అవార్డ్స్



**హనుమకొండ,నవంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** విద్యారణ్యపురిలోని ఏకశిల హై స్కూల్‌లో వి ఎస్ అకాడమీ ట్యుటోరియల్ ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ లెవెల్ రంగోత్సవ ఆర్ట్ కంపిటీషన్ అవార్డ్స్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 100 మందికి పైగా విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. అందులో 38 మంది విద్యార్థులు ఇంటర్నేషనల్ లెవెల్ ఆర్ట్ పోటీకి ఎంపిక కావడం గర్వకారణం. ఈ విశిష్ట విజయానికి తల్లిదండ్రుల ప్రోత్సాహం, విద్యార్థుల కృషి, వి ఎస్ అకాడమీ యొక్క మార్గదర్శకత్వం ప్రధాన ఆధారం. కిండర్ గార్టెన్ నుంచి ఇంటర్ వరకు వివిధ తరగతుల విద్యార్థులు పాల్గొని బహుమతులు, అచీవ్‌మెంట్ సర్టిఫికేట్లు, సర్ప్రైజ్ గిఫ్టులు, గోల్డ్ మెడల్, సిల్వర్ మెడల్, బ్రాంజ్ మెడల్ వంటి పురస్కారాలను సాధించారు. ఈ కార్యక్రమంలోవి ఎస్ అకాడమీ ట్యుటోరియల్ ఫౌండర్ శ్రీ తడూరి వేణుగోపాల్ స్వామి,ప్రిన్సిపాల్ తడూరి కల్యాణి,సమన్వయకర్త శ్రీ కరుణాకర్,సపోర్టర్స్ టి. విజయ్ కుమార్, జయశ్రీ,తో పాటు అనేకమంది తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు. విఎస్ అకాడమీ నిర్వహణ ఈ విజయాన్ని అందరి సహకారానికి అంకితం చేస్తోంది.

## మానవత్వాన్ని చాటుకున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం





**గంగాధర నవంబర్ 17(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలం కురిక్యాల గ్రామానికి చెందిన భీమనాతిని సత్యవ్వ అనే మహిళ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడింది. గంగాధర మండలంలో వివిధ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం కోసం అటుగా వెళు తున్న చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రమాదాన్ని గమనించి తన వాహనాన్ని ఆపారు. గాయపడిన మహిళను దగ్గరుండి స్థానిక పోలీస్ వాహనంలో కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. కరీంనగర్ లోని ఆసుపత్రి వైద్యులతో ఫోనులో మాట్లాడి గాయపడిన మహిళకు మెరుగైన వైద్యం అందజేయాలని ఆదేశించారు. ప్రమాదంలో గాయపడిన మహిళను స్వయంగా ఆసుపత్రికి తరలించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ను మండల ప్రజలు అభినందించారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి...





**కరీంనగర్,నవంబర్17(పీసీడబ్ల్యూ న్యూస్):** కట్టరాంపూర్ లోని కార్తికేయ నగర్ కాలనీలో చాలాకాలంగా పెండింగులో ఉన్నటువంటి డ్రైనేజీ సమస్యను సుడా నిధులు పది లక్షలు మంజూరు చేసి సమస్యను పరిష్కరిస్తున్నామని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. పనులకు శంకుస్థాపన అనంతరం ఆయన మాట్లాడుతూ ఎక్కడికక్కడ సమస్యలు పరిష్కరించుకుంటూ ముందుకు వెళ్తున్నామని మున్సిపల్ సాధారణ నిధులతో పాటు సుడా నిధులతో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నామని నగర సుందరీకరణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టామని అన్నారు.స్థానికుల కోరిక మేరకు కార్తికేయ నగర్ నుండి అపూర్వ ఎంక్లేవ్ మీదుగా కట్టరాంపూర్ మెయిన్ రోడ్డు వరకు డ్రైనేజీ మరియు రోడ్డు నిర్మాణం చేపడుతామని నరేందర్ రెడ్డి హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక మాజీ కార్పోరేటర్ ఆకుల నర్మద నర్సయ్య,నెల్లి నరేష్,దన్న సింగ్,బత్తిని చంద్రయ్య,గంగుల దిలీప్,విఠల్ రెడ్డి,సూర్య నారాయణ,సత్యంరావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి మహిళకు చదువు నేర్పించాలి: డిఆర్ డిఏ డీపీఎం పద్మప్రియ



**హన్మకొండ,నవంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** స్వయం సహాయక సంఘాల లోని ప్రతి మహిళకు చదువు నేర్పించే భాద్యత సెర్ప్ సిబ్బందిని డిఆర్ డిఏ హెచ్ డి డీపీఎం పద్మ ప్రియ సిబ్బందికి సూచించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, సెర్ప్ సీఈఓ ఆదేశానుసారం సోమవారం హసన్ పర్తి మండల కేంద్రం లోని సంస్కృతి విహార్ నందు ఉల్లాస్, వయోజన విద్యా కార్యక్రమంలో భాగంగా 'అమ్మకు అక్షరమాల' శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమం ద్వారా గ్రామాల్లోని స్వయం సహాయక సంఘాలలో గల 15 సంవత్సరాల పైబడిన మహిళలకు విద్య అందించాలని సూచించారు. ఈ శిక్షణ కార్య క్రమంలో హెచ్ డి డీపీ ఎం పద్మప్రియ, ఏపీ ఎం నారాయణ, కమ్యూనిటీ కో.. ఆర్డినేటర్లు దుర్గం అనురాధ, నరహరి, అరుణ, వివో అధికారులు, వివోఏ లు, సిబ్బంది పాల్గొన్నారు.

# పల్లెల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

### గంగాధర మండలంలోని వివిధ గ్రామాల్లో రూ. 1.15 కోట్లతో అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం







**గంగాధర నవంబర్ 17 (పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం లోని ప్రతిపల్లెను అభివృద్ధి చేయడానికి ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. మండలంలోని గట్టుభూత్కూర్లో రూ. 20 లక్షలు, గంగాధరలో రూ. 20 లక్షలతో నిర్మిస్తున్న ఆరోగ్య ఉప కేంద్రాల భవన నిర్మాణానికి, వెంకంపల్లి లో రూ. 20 లక్షలతో నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి, రూ. 5 లక్షలతో ప్రెస్ క్లబ్ నిర్మాణా పనులకు శంకుస్థాపన చేశారు. గంగాధరలో రూ. 44 లక్షలతో , మధురానగర్ లో రూ. 11 లక్షలుతో నిర్మించిన సీసీ రోడ్లను, రూ. 11 లక్షలతో మండల కేంద్రంలోని ఎస్సీ బాయ్స్ హాస్టల్ మరమ్మత్తు పనులను, మండల కేంద్రంలో రూ. 5 లక్షలతో నిర్మించిన సబ్ డివిజన్ కాంపౌండ్ వాల్, రూ. 5 లక్షలతో నిర్మించిన బతుకమ్మ ఘాట్,రూ. 5 లక్షలతో అంబేద్కర్ సంఘ భవనంలో వేసిన సీసీ ప్లాట్ ఫామ్ ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని పల్లెల అభివృద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. తొక్కదండి నియోజకవర్గం లోని ప్రతి పల్లెను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, రాష్ట్రానికి రోల్ మోడల్ గా తీర్చిదిద్దుతామన్నారు. చొప్పదండి నియోజకవర్గం లో ఇప్పటికే ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మంజూరు చేయించినట్లు తెలిపారు. నారాయణపూర్ రిజర్వాయర్ కింద ముంపునకు గురవుతున్న భూములు ఇండ్లకు సంబంధించి నిర్వాసితులకు రూ. 23.50 కోట్లు మంజూరు చేయించినట్లు తెలిపారు. చొప్పదండి నియోజకవర్గం ప్రజలు తనపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయనని, రానున్న రోజుల్లో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలో నిలుపుతామన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వ సంక్షేమ ప్రజల్లో ప్రచారం చేయాలని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించే దిశగా పనిచేయాలని సూచించారు. పార్టీ కోసం పనిచేసిన ప్రతి కార్యకర్తకు గుర్తింపునిచ్చి కాపాడుకుంటామని భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో గంగాధర మార్కెట్ కమిటీ చైర్మన్ జాగిరపు రజిత శ్రీనివాస్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ వెలిచాల తీర్మల్ రావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తోట కరుణాకర్, సింగిల్ విండో వైస్ చైర్మన్ వేముల భాస్కర్, ఎంపీడీవో రామ్ ,మండల అధ్యక్షుడు పురుమల్ల మనోహర్,బుచ్చన్న, రామిడి రాజిరెడ్డి,పడాల రాజన్న,తాళ్ళ శ్రీనివాస్, గంగాధర ప్రవీణ్,తాళ్ళ సురేష్,బుర్గు గంగన్న, రాజగోపాల్ రెడ్డి,దోర్నాల శ్రీనివాస్ రెడ్డి,సత్తు కనుకయ్య, పడితపల్లి కిషన్,తోట సంధ్య ,వేముల అంజి,రోమాల రమేష్,బాపు రెడ్డి,మేర్గ కొండయ్య, స్వామి,గరిగంటి కరుణాకర్,దికొండ మధు , సతీష్, మహేష్, శంకరయ్య, చందు,నగేష్,కొల ప్రభాకర్,మ్యాక వినోద్, మహేష్,గంగివేణి నవిన్, మంత్రి మహేందర్,తదితరులు పాల్గొన్నారు.


## కరీంనగర్ మున్సిపల్ పరిమితిలో ప్రతి డివిజన్‌లో పబ్లిక్ లైబ్రరీల ఏర్పాటు చేయాలని డిమాండ్



**కరీంనగర్ టౌన్ నవంబర్ 17(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో 43వ డివిజన్ నుంచి పోటీ చేస్తున్న ఎఐఎంఐఎం నాయకుడు అన్నెమల్ల సురేష్ మున్సిపల్ పరిధిలోని 66 డివిజన్లలో పబ్లిక్ లైబ్రరీలు ఏర్పాటు చేయాలని కోరుతూ ఈరోజు మున్సిపల్ కమిషనర్‌ను కలిసి ఒక ప్రాతినిధ్య పత్రాన్ని సమర్పించారు.ఇప్పటికే పౌరులు ఇంటి పన్నులో భాగంగా లైబ్రరీ సెస్ చెల్లిస్తున్నప్పటికీ, నగరంలో సరిపడా పబ్లిక్ లైబ్రరీలు లేకపోవడం బాధాకరమని ఆయన పేర్కొన్నారు. ప్రజలకు విజ్ఞానాన్ని చేరవేయడంలో, విద్యార్థులు–యువతకు అభ్యాస వాతావరణం కల్పించడంలో లైబ్రరీలు కీలకమని అన్నారు.మున్సిపల్ కార్పొరేషన్ తక్షణమే చర్యలు తీసుకొని ప్రతి డివిజన్‌లో ఒక పబ్లిక్ లైబ్రరీను ఏర్పాటు చేయాలని అన్నెమల్ల సురేష్ డిమాండ్ చేశారు. ప్రాతినిధ్య పత్రాన్ని స్వీకరించిన కమిషనర్ దీనిపై సానుకూలంగా స్పందించినట్లు తెలిసింది.

# జనావాసాల్లో వైన్ షాప్ అనుమతిని రద్దు చేయండి

- **ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన కశ్మీర్ గడ్డ వాసులు**





**కరీంనగర్ టౌన్ నవంబర్ 17(పిసిడబ్ల్యూ న్యూస్):** నగరంలోని కశ్మీర్ గడ్డ ప్రాంతంలో టూ టౌన్ ఎదురుగా, ఆర్బీ స్వీట్ హౌస్ పక్కన ప్రముఖ విద్యా సంస్థలు, మస్జిద్, ప్రార్థన ఆలయాలకు అతి సమీపంలో, ముఖ్యంగా జనవాసాల్లో, బార్/వైన్ దుకాణం తెరవడాన్ని వ్యతిరేకిస్తూ, సోమవారం కశ్మీర్ గడ్డ నివాసులు, ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా కాలనీ వాసులు షేక్ షబ్బీర్, ఖాజా షా నవాజ్, సాజిద్ ఖాన్ లు మాట్లాడుతూ...తమ కాలనీ ప్రశాంతమైన ప్రాంతం, ఇక్కడ పిల్లలు, సీనియర్ సిటిజన్లు, మహిళలు పెద్ద సంఖ్యలో ఉంటారు. ప్రస్తుతం ఏర్పాటు చేయబోయే వైన్స్ సమీపంలో ఒక మసీదుతో పాటు ప్రముఖ విద్యాసంస్థలు స్కూళ్లు, కళాశాలలు ఉన్నాయి. విద్యార్థులు, కుటుంబాలతో నిత్యం జన సాంద్రత ఎక్కువ ఉన్న ప్రాంతంలో మద్యం దుకాణం తెరవడం అశాంతికి దారితీస్తుంది. నివాస యోగ్యత కలిగిన ప్రదేశంలో బార్/వైన్ దుకాణం ద్వారా నిత్యం మద్యం సేవించే మందుబాబుల ఆగడాలతో కుల, మత పరమైన గొడవలు జరిగే ప్రమాదం ఉంది. ఈవైన్ షాపు ఏర్పాటుతో మహిళలు, పిల్లలు, వృద్ధులకు భద్రతా సమస్యలు తలెత్తుతాయి. సమీపంలో ప్రార్థనా స్థలం (మసీదు) ఉండటం వల్ల ఈ ప్రదేశం ఒక వర్గం మనోభావాలను దెబ్బతీస్తుందన్నారు. మునిసిపల్, ఎక్సైజ్ మార్గదర్శకాల ప్రకారం, మద్యం దుకాణాలు సాధారణంగా పాఠశాలలు, మతపరమైన సంస్థలు, జనసాంద్రత కలిగిన ప్రదేశాల్లో ఏర్పాటు చేయకూడదనే నిబంధనలు ఉన్నా.. అధికార యంత్రాంగం పెడచెవిన పెట్టడం శోచనీయమన్నారు. ఈప్రాంతంలో బాలికల హాస్టళ్లు, కళాశాలలు, పాఠశాలలు ఉన్నాయని.. దీని వలన బార్/వైన్ దుకాణంతో పాటు వైన్ సిట్టింగ్ ఏర్పాటుతో, స్థానిక ప్రజలకు, ప్రజా రవాణాకు నిత్యం అసౌకర్యంగా మారుతుంది. కావున జిల్లా కలెక్టర్ స్పందించి తక్షణమే ఈవైన్స్ షాపు అనుమ తులను రద్దు చేయాలని, ఈవైన్ షాప్ ను మరో చోటుకి తరలించేలా చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు విజ్ఞప్తి చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో షేక్ మహబూబ్ పాషా, ఖాజా జమాలొద్దీన్, జి. కృష్ణ, డా. జయంతి, ఖాజా మినహజోద్దీన్ అక్తర్ అలీ, యూసుఫ్, హబీబ్, హాజీ తదితరులు ఉన్నారు.

## డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్ పూర్తి చేయుటకు నిధులు విడుదల చేయాలని రవాణా మంత్రిని కోరిన జిల్లా ఆర్టిఏ మెంబర్ పడాల రాహుల్...



**హైదరాబాద్,నవంబర్17(పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా, మానకొండూరు నియోజకవర్గంలో గల తిమ్మాపూర్ రవాణా కార్యాలయంలో డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్ పూర్తి మరియు మరమ్మత్తు కోసం నిధుల విడుదల చేయాలని కోరుతూ నేడు కరీంనగర్ జిల్లా రవాణా సంస్థ సభ్యుడు పడాల రాహుల్ రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ గారిని రాష్ట్ర సచివాలయంలోని తన ఛాంబర్ లో కలిసి వినతి పత్రం అందజేయడం జరిగింది.కరీంనగర్ జిల్లా, తిమ్మాపూర్ లోని జిల్లా రవాణా కార్యాలయ ప్రాంగణంలో, తెలంగాణ ప్రభుత్వం నిర్మించిన శాస్త్రీయ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్ నిధుల కొరత కారణంగా నిరుపయోగంగా ఉంది. ట్రాక్‌ను క్రియాత్మకంగా మార్చడానికి మరియు డ్రైవర్లకు డ్రైవింగ్ పరీక్షలను నిర్వహించడానికి, కొన్ని మరమ్మతులు మరియు పనులు అవసరం.జిల్లా ఆర్ అండ్ బి అధికారి డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్ మరమ్మత్తు కోసం ఇచ్చిన సూచనల మేరకు దెబ్బతిన్న కర్బ్‌లను సరిగ్గా పరిశీలించి, గతంలో ట్రాక్‌ను డ్రైవింగ్ పరీక్షలు నిర్వహించడానికి యోగ్యమైనదిగా మార్చారు, కానీ ప్రస్తుతం ఆ ట్రాక్ పూర్తిగా దెబ్బతిన్న కారణంగా ట్రాక్ మరమ్మతుల కోసం, డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్ పనులను చేపట్టడానికి అదనంగా 50 లక్షల రూపాయలు నిధులు అవసరమని పేర్కొన్నారు. కావున ఈ పనుల నిర్వహణ కోసం నిధులను విడుదల చేసే విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలని, ఇది కొత్త డ్రైవింగ్ లైసెన్స్‌లు కోరుకునే వ్యక్తులకు ఎంతో ప్రయోజనం చేకూరుస్తుందని మరియు మన ప్రాంతంలో రహదారి భద్రతను పెంచుతుందని తెలియజేస్తూ అభివృద్ధి నిధులు మంజూరు చేయాలని పడాల రాహుల్ రవాణా మంత్రికి అందజేసిన వినతిపత్రం ద్వారా కోరినారు

## మెడికల్ టెస్టుల పేరుతో కాంట్రాక్ట్ కార్మికులను భయభ్రాంతులకు గురిచేస్తున్న సింగరేణి యాజమాన్యం...

- **తోటమాలి కార్మికురాలు సరోజన మృతికి సింగరేణి యాజమాన్యమే కారణం.**
- **మృతురాలి కుటుంబాన్ని సింగరేణి యాజమాన్యం అన్ని రకాలుగా ఆదుకోవాలి.**
- **PSCWU TUCI రాష్ట్ర ప్రధాన కార్యదర్శితో కల రమేష్.**



**గోదావరిఖని,నవంబర్17(పీసీడబ్ల్యూ న్యూస్):** సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను మెడికల్ టెస్ట్ ల పేరుతో తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నది. సింగరేణి హాస్పిటల్ లో టెస్టులను నిర్వహించవలసిన సింగరేణి యాజమాన్యం ఇక్కడ పరికరాలు లేవనే సాకుతో వారిని కరీంనగర్, వరంగల్, హైదరాబాద్ ప్రైవేట్ ఆస్పత్రుల చుట్టూ తిప్పుతోంది. ప్రతి మహిళా కార్మికురాలికి స్కానింగ్ ల పేరుతో ప్రైవేటు స్కానింగ్ సెంటర్లకు పంపుతూ వారిని ఆర్థికంగా మానసికంగా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుంది. కాంట్రాక్ట్ కార్మికులు అనారోగ్యంతో ఉంటే వైద్యాన్ని అందించాల్సిన కనీస బాధ్యతను కూడా సింగరేణి యాజమాన్యం నిర్వహించడం లేదు. శారద నగర్ లో తోటమాలి కార్మికురాలుగా పనిచేస్తున్న సరోజన అనే కార్మికురాలని గుండె బాగా లేదని సాకుతో ప్రైవేట్ ఆస్పత్రుల చుట్టూ వారాల తరబడి తిప్పుతూ తీవ్ర ఆందోళనకు గురి చేయడం మూలంగా ఆ కార్మికురాలు మరణించడం జరిగింది. సరోజన మృతికి సింగరేణి యాజమాన్యమే పూర్తి బాధ్యత వహించాలి. సింగరేణి ఆస్పత్రుల్లో మాత్రమే టెస్టులు నిర్వహించాల్సిన సింగరేణి యాజమాన్యం ప్రైవేటు ఆసుపత్రులకు పంపాల్సిన అవసరం ఏమిటని సింగరేణి యాజమాన్యాన్ని ప్రశ్నిస్తున్నాం. కాంట్రాక్ట్ కార్మికులకు అసలు మెడికల్ టెస్టులు నిర్వహించాల్సిన అవసరమే లేదని తెలియజేస్తున్నాము. సింగరేణి యాజమాన్యం తీవ్ర మానసిక ఒత్తిడికి గురి చేయడం మూలంగానే సరోజన అనే తోటమాలి కార్మికురాలు చనిపోవడం జరిగింది. కనీస వైద్యం అందించలేని సింగరేణి యాజమాన్యం కాంట్రాక్టు కార్మికులను మెడికల్ టెస్ట పేరుతో ఇబ్బందులకు గురి చేసే విధానాన్ని మానుకోవాలని డిమాండ్ చేస్తున్నాము. సింగరేణి యాజమాన్యం ఒత్తిడి మూలంగా మరణించిన సరోజన అనే తోటమాలి కాంట్రాక్టు కార్మికుల కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నాము.

# వరి కోత మిషన్లు లేక నేలపాలవుతున్న వరి ధాన్యం

**• వరి కోత మిషన్లు ఉన్నవారు మా తండాను సందర్శించండి అని వేడుకుంటున్న తండ వాసులు**








**తొర్రూరు ప్రతినిధి, నవంబర్ 17(పిసిడబ్ల్యూ న్యూస్):** ఆరుగాలం కష్టించి పనిచేసి పంటను పండిస్తే చివరి దశలో వరి కోత మిషన్ లేక పండిన పంట నేల పాలవుతుందని దస్రు తండా వాసులు ఆందోళనకు గురవుతున్నారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణంలోని 13వ వార్డుకు చెందిన దస్రు తండా గ్రామంలో వేసిన వరి ధాన్యం కోసేందుకు కోత మిషన్లు లేక అనేక అవస్థలు ఎదుర్కొంటున్నామని కోత మిషన్ యజమానులు ఎవరైనా సరే మా గ్రామానికి వచ్చి వరి కోయ్యాల్సిందిగా వారు వేడుకుంటున్నారు. మరోసారి అకాల వర్షం వస్తే పండిన పంట మొత్తం చేతికి రాకుండా భారీగా నష్టపోయే అవకాశాలు ఉన్నాయని ఇప్పుడు కొడుతున్న ఎండలకి వరి ధాన్యం మొత్తం తేమ లేకుండా పొలంపైనే వడ్లు రాలిపోయే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరి కోత మిషన్లు ఎవరికి ఉన్నా సరే మా గ్రామానికి సందర్శించి సకాలంలో రైతులను ఆదుకోవాలని తండావాసులు వేడుకుంటున్నారు.

# మున్సిపల్ అధికారులారా ప్రయాణికుల ప్రాణాలు కాపాడండి

**• మోడు బారిన చెట్టు నా కింద నిల్చుంటే ప్రాణాలు తీస్తా అంటుంది?**

**• భయభ్రాంతులకు గురవుతున్న పాదచారులు.**

**• ఆవేదన వ్యక్తం చేస్తున్న యువకులు.**






**తొర్రూరు ప్రతినిధి, నవంబర్ 17(పిసిడబ్ల్యూ న్యూస్):** అన్నీ ఉన్న అంగట్లో శని ఉందన్నట్లు అనే సామెత ఊరికే రాలేదు. మోడు బారిన నా జీవితం తనువు చాలించేందుకు సిద్ధంగా ఉన్నా అధికారులు ఎందుకు నా వైపు చూడటం లేదు. ఎవరిలో శని ఉన్న నా క్రింది నుండి వెళితే ప్రాణాలకే ప్రమాదం అంటున్న వృక్షం. వివరాలలోనికి వెళితే వరంగల్ -ఖమ్మం జాతీయ రహదారిలో గల తొర్రూరు పట్టణంలో కాసం బట్టల షాపుకు ఎదురుగా సమీపంలో ప్రధాన రహదారి పక్కనే మో డు బారిన వృక్షం కనబడుతుంది. ఆ వృక్షం అలా ఉందని తెలియక ఒక పెళ్లి బృందం కారులో వచ్చి మోడు బారిన చెట్టు కింద కారుని నిలిపివేశారు. ప్రమాదం ఎప్పుడూ ఎవరిని వరిస్తుందో తెలియదు. వెంటనే మున్సిపల్ అధికారులు స్పందించి వాహనదారులు, పాదచారుల ప్రాణాలను కాపాడాలని అటుగా వెళుతున్న గుగులోతు అనిల్ పేర్కొన్నారు. ఇదే కాకుండా పట్టణంలోని మరికొన్ని మోడు బారిన వృక్షాలు కూడా దర్శనం ఇస్తూ ఉంటాయి. వేగంగా వీచే గాలి దుమారాలకు చెట్టు కొమ్మలు విరిగి కింద పడే అవకాశాలు లేకపోలేదని వాహనదారులు కూడా వారి ఆవేదన వెళ్ళబుచ్చారు.

# అమ్మాపురం వాగుపై హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయండి

**• రాత్రి వేళలో పక్కకు జరిగితే ప్రాణాలు పోయే అవకాశం ఉందంటున్న వాహనదారులు**



**తొర్రూరు ప్రతినిధి, నవంబర్ 17(పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రతి సంవత్సరం అధిక వర్షాలతో వాగులు పొంగి రోడ్డు లెవెల్ వంతెన కింది భాగం అలాగే రోడ్డు పక్కన నీటికి రోడ్డు కొట్టుకుపోవడం జరుగుతూనే ఉంది. ఇలా ప్రతి సంవత్సరం జరుగుతూనే ఉన్నప్పటికీ ప్రభుత్వ అధికారులు ఎవరూ పట్టించుకోక శాశ్వత పరిష్కారం చేయకపోవడంతో ఎగువ భాగంలో ఉన్న అమ్మాపురం, కానాపురం,గుర్తురు, గ్రామాల ప్రజలకు అటు ఈదుల వాగు ఇటు అమ్మాపురం వాగు దాటి ఎటు వెళ్లలేక వర్షాకాలంలో ఎన్నో అవస్థలు పడుతున్నారు. గత ప్రభుత్వంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అమ్మపురం వాగు రోడ్డు లెవెల్ వంతెన పూర్తిగా కొట్టుకుపోవడంతో తాత్కాలిక పరిష్కారంగా గ్రానైట్ రాళ్ళను వేసి మార్గాన్ని సుగమం చేశారు. ఈ సంవత్సరం వర్షాకాలంలో వంతెనకు ఏమి కాకపోయినాప్పటికీ ఇరువైపులా రహదారి కొట్టుకుపోవడంతో వాహనాల రాకపోకల కు అంతరాయం ఏర్పడింది. విషయాన్ని తెలుసుకున్న పాలకుర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే యశస్విని రెడ్డి వాగు ప్రాంతాన్నిసందర్శించి తాత్కాలికంగా కాకుండా వంతెన ఎత్తు పెంచి నిర్మించే విధంగా ఏర్పాటు చేస్తానని ఆ ప్రాంత గ్రామాల ప్రజలకు హామీ ఇచ్చారు. ప్రస్తుత పరిస్థితులలో ఇరువైపులా కొట్టుకుపోయిన రహదారి రాత్రి సమయంలో ఏమి ఏర్పడకుండా ఉన్నదని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి కొట్టుకుపోయిన రోడ్డు మార్గం వద్దా హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయకపోతే ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుందని అంటున్నారు. అటువైపుగా వెళ్లకుండా రోడ్డు చివరిలో బండరాలను వేసి ప్రమాదాలను అరికట్టాలని వేడుకుంటున్నారు.

# పొగమంచు తీవ్రత పెరుగుదల..

**• రాత్రి, తెల్లవారుజామున ప్రయాణాలు మానేయండి: ఎస్ఐ రాజ్‌కుమార్ విజ్ఞప్తి**

**ములుగు జిల్లా, నవంబర్ 17(పిసిడబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లా ఏటూరునాగారం, లైట్నూరు, తాడ్వాయి పరిసర ప్రాంతాల్లో గత కొన్ని రోజులుగా ఉదయం, రాత్రి సమయంలో పొగమంచు తీవ్రత పెరుగుతూ ఉంది. దీనివల్ల రహదారులపై వీక్షణ సామర్థ్యం గణనీయంగా తగ్గి వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు పెరిగాయి. ఈ నేపథ్యంలో ఏటూరునాగారం ఎస్ఐ రాజ్‌కుమార్ ప్రజలకు అప్రమత్తత సూచనలు జారీ చేశారు.ఎస్ఐ రాజ్‌కుమార్ మాట్లాడుతూ "రాత్రి మరియు తెల్లవారుజామున ఏర్పడే దట్టమైన పొగమంచు కారణంగా ముందున్న రహదారి, ఎదురుగా వచ్చే వాహనాలు, పాదచారులు స్పష్టంగా కనిపించడం లేదు. ఈ పరిస్థితుల్లో వాహనం నడపడంలో చిన్నపాటి నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదానికి దారితీసే అవకాశం ఉంది. కాబట్టి అత్యవసర పరిస్థితుల్లో తప్ప ఈ సమయంలో ప్రయాణాలు చేయకుండా ప్రజలు జాగ్రత్త పడాలి" అని సూచించారు.**పొగమంచుతో రహదారుల పరిస్థితి కష్టతరం** ఏటూరునాగారం–లైట్నూరు రహదారులపై తెల్లవారుజామున దృష్టి స్పష్టత 20 నుంచి 50 మీటర్ల వరకు మాత్రమే ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పల్లె ప్రాంతాల్లో రోడ్డు పక్కన నడిచే పాదచారులు, మలుపులు, చిన్న వాహనాలు సరిగ్గా కనిపించక ఢీకొనే ప్రమాదం ఎక్కువగా ఉంది. దీంతో ఉదయం ఉద్యోగాలకు, మార్కెట్లకు వెళ్లే ప్రజలు కూడా భయం వ్యక్తం చేస్తున్నారు. **వాహనదారులు తప్పనిసరిగా పాటించాల్సిన సూచనలు:** వాహనాలను నిదానంగా నడపాలి ం వేగం పెంచకూడదు. హెడ్‌లైట్లను లో–బీమ్‌లో ఉంచాలి. ఫాగ్ లైట్లు ఉన్నవారు తప్పనిసరిగా వాడాలి. వాహనాల మధ్య సురక్షిత దూరం పాటించాలి. హఠాత్తుగా బ్రేకులు వేయకుండా, జాగ్రత్తగా డ్రైవింగ్ చేయాలి. అత్యవసరం తప్ప రాత్రి, తెల్లవారుజామున ప్రయాణాలు మానుకోవాలి.ఎస్ఐ రాజ్‌కుమార్ మాట్లాడుతూ, "ప్రతి సంవత్సరం ఈ కాలంలో పొగమంచు కారణంగా రోడ్డు ప్రమాదాలు పెరుగుతాయి. ఈసారి కూడా ఇప్పటికే కొన్ని ప్రమాదాలు నమోదవడంతో, ప్రజల భద్రత దృష్ట్యా ముందుగానే హెచ్చరికలు జారీ చేస్తున్నాం. ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలి" అని తెలిపారు.**ప్రజల భద్రతే ముఖ్యము** ములుగు జిల్లా వ్యాప్తంగా పోలీసులు ఇప్పటికే రాత్రి పహారా, రోడ్డు మూలాలను పరిశీలిస్తూ వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నారు. గ్రామాల నుంచి పట్టణాలకు ప్రయాణించే వారికి ప్రత్యేక సూచనలు జారీ చేశారు. పాఠశాల బస్సులు, ప్రయివేట్ వాహనాలు కూడా పొగమంచు సమయంలో వేగం తగ్గించాలని సూచనలు జారీ చేసినట్లు సమాచారం.

# ఏటూరునాగారంలో నార్కోటిక్ స్నిఫర్ డాగ్‌తో విస్తృత తనిఖీలు



**• మత్తుపదార్థాల విక్రయంపై పోలీసుల కఠిన నిఘా**



**ములుగు జిల్లా, నవంబర్ 17(పిసిడబ్ల్యూ న్యూస్):** ఏటూరునాగారం పట్టణంలో అక్రమ మత్తు పదార్థాల నియంత్రణలో భాగంగా పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. మార్కెట్ ఏరియాలోని కిరాణా దుకాణాలు, చిన్న వ్యాపార కేంద్రాల్లో నార్కోటిక్ స్నిఫర్ డాగ్ సహాయంతో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎస్ఐ రాజకుమార్, ఎస్ఐ నరేష్ సిబ్బందితో కలిసి పర్యవేక్షించారు.వీరు మాట్లాడుతూ "ప్రాంతంలో గంజాయి, మత్తు పదార్థాలు, చిన్నపిల్లలకు గుట్కా, సిగరెట్లు విక్రయించే దుకాణాల పై కఠిన చర్యలు తీసుకుంటాము. ఎవరు ఈ అక్రమ కార్యకలాపాల్లో పాలుపంచుకున్నా చట్టపరమైన చర్యలు తప్పవు" అని హెచ్చరించారు.**తనిఖీలు ఎలా జరిగాయి?** మార్కెట్ ఏరియాలోని అనేక కిరాణా షాపుల్లో ప్రత్యేక నార్కోటిక్ స్నిఫర్ డాగ్‌తో పోలీసులు లోతుగా స్వీప్ చేశారు.షాపుల షెల్ఫ్‌లు, స్టోర్ రూములు, కౌంటర్ల చుట్టూ డాగ్ టీమ్ శ్రద్ధగా పరిశీలించింది.మత్తు పదార్థాల విక్రయం జరుగుతున్నదేనా అన్న సందేహాస్పద ప్రాంతాలను పరిశీలించారు. పోలీసు సిబ్బంది ప్రతి దుకాణదారునికి న్యాయపరమైన హెచ్చరికలు జారీ చేశారు.**ఎందుకు ఈ తనిఖీలు?** ప్రాంతంలో యువతపై మత్తు పదార్థాల ప్రభావం పెరుగుతున్న నేపథ్యంలో గంజాయి, సింథటిక్ డ్రగ్స్ విక్రయాన్ని అరికట్టడం,చిన్నారులకు గుట్కా, సిగరెట్లు అమ్మే దుకాణాలపై నిఘా పెంచడం, మార్కెట్ ఏరియాలో చట్టవిరుద్ధ కార్యకలాపాలను పూర్తిగా నిర్మూలించడం ప్రధాన లక్ష్యమని పోలీసులు తెలిపారు. సిబ్బంది పాల్గొనడం ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ గోపి, విక్రమ్ తదితరులు పాల్గొని తనిఖీలను సమర్థవంతంగా నిర్వహించారు. స్థానిక ప్రజలు పోలీసుల చర్యలను అభినందిస్తూ, ఇలాంటి తనిఖీలు తరచూ జరగాలని కోరుతున్నారు.**పోలీసుల స్పష్టమైన హెచ్చరిక** "మత్తు పదార్థాల అమ్మకం, కొనుగోలు, నిల్వ పట్ల ఎలాంటి రాజీ లేదు. చిన్నారుల భవిష్యత్తు దృష్ట్యా గుట్కా, సిగరెట్లు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు" అని ఎస్ఐ రాజకుమార్ స్పష్టం చేశారు.

# ఏటూరునాగారంలో దారుణం

**- మైనర్ బాలికతో సంబంధం పెట్టుకున్న ఎలక్ట్రిషన్‌ను గ్రామ పెద్దలు కట్టేసి బలాత్కారంగా కొట్టి హత్య**






**ములుగు జిల్లా, నవంబర్ 17(పిసిడబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలో హృదయ విదారక ఘటన వెలుగులోకి వచ్చింది. మండల కేంద్రానికి చెందిన జాడి సమ్మయ్య (40) వ్యక్తిగత జీవితంలో విభేదాలు, మద్యపాన అలవాటు మరియు మైనర్ బాలికతో అనుచిత సంబంధం కలయిక అతని ప్రాణాలను తీసింది. వివరాల్లోకి వెళితే.. ఎలక్ట్రిషన్‌గా పనిచేస్తూ తన కుటుంబంతో ఏటూరునాగారం మండల కేంద్రంలో నివసిస్తున్న జాడి సమ్మయ్యకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే గత కొద్ది నెలలుగా లాలాయగూడెం గ్రామానికి చెందిన 16 ఏళ్ల బాలికతో వివాహేతర సంబంధం పెట్టుకుని తరచూ అక్కడికే వెళ్లేవాడని స్థానికుల సమాచారం.ఈ వ్యవహారం కుటుంబంలో కలహాలకూ దారితీసింది. కొద్ది రోజుల క్రితం సమ్మయ్య తండ్రి కూడా ఇంట్లో తరచూ గొడవలు జరుగుతున్నాయని ఏటూరునాగారం పోలీసులను ఆశ్రయించినట్లు తెలుస్తోంది.**యువతి ఫోన్ చేయడంతో ఘటన చోటుచేసుకుంది** నిన్న రాత్రి ఇంట్లో ఎవరూ లేరని, అందరూ ఊరికి వెళ్లారని చెప్పి యువతి సమ్మయ్యను లాలాయగూడెం గ్రామానికి రమ్మని ఫోన్ చేసినట్లు సమాచారం. దీని ప్రకారం ఆదివారం సాయంత్రం సమ్మయ్య తన టీఎస్ 25 ఏ 7666 నంబర్ గల హోండా బైక్‌పై అక్కడికి చేరుకున్నాడు.మాటువేసి పట్టుకున్న యువతి బంధువులు – విద్యుత్ స్తంభానికి కట్టి దారుణంగా హింససమ్మయ్య గ్రామంలోకి రాగానే ఇప్పటికే అక్కడ మాటువేసి ఉన్న యువతి బంధువులు అతనిపై దాడి చేశారు. గ్రామంలోని ఓ విద్యుత్ స్తంభానికి కట్టేసి విపరీతంగా కొట్టినట్లు సమాచారం. తీవ్రమైన గాయాలతో సమ్మయ్య అక్కడికక్కడే మరణించాడు.**పోలీసులు కేసు నమోదు – దర్యాప్తు కొనసాగుతోంది** సంఘటనపై స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా, ఏటూరునాగారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు త్వరలో వెలుగులోకొచ్చే అవకాశం ఉంది. యువతి బంధువుల పాత్ర, యువతి వాంగ్మూలం, సమ్మయ్య కుటుంబ పిర్యాదు వంటి అంశాలపై విచారణ జరుగుతోంది.

# ములుగు జిల్లా - ఏటూరునాగారం మండలంలో తీవ్ర చలి బీభత్సం

**ప్రజలు వణికిపోతూ, ఉదయం గంటల్లో బయటకు రావడానికి బెంగ**

**- చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ఆరోగ్య సమస్యలు తీవ్రం**



**ములుగు జిల్లా,నవంబర్ 17(పిసిడబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలో గత కొద్ది రోజులుగా ఎడతెరిపి లేకుండా పెరుగుతున్న తీవ్ర చలితో ప్రజలు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లోతట్టు ప్రాంతాల్లో, గిరిజన గ్రామాల్లో, అటవీ ప్రాంతాల దగ్గర చల్లగాలులు మరింత వేగంగా వీచిపోవడంతో పరిస్థితి మరింత క్లిష్టంగా మారింది.ఉదయం పూట మంచు కమ్ముకుని, రోడ్లు తెల్లగా కన్పించేంతగా చలి పెరిగిపోయింది. పాఠశాలలకు వెళ్లే చిన్నారులు, పనులకు వెళ్లే రైతులు, కొలువులకు బయలుదేరు కార్మికులు.. అందరూ తరుణమైన చలికి వణుకుతూ బయటికి రావాల్సి వస్తోంది.ప్రత్యేకంగా వృద్ధులు, చిన్న పిల్లలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు.కొన్ని గ్రామాల్లో ఉదయం 5 గంటల ప్రాంతంలో ఉష్ణోగ్రతలు ప్రమాదకర స్థాయికి పడిపోయి, అగ్ని వేడి దగ్గర కూర్చునే జనాల రద్దీ పెరిగింది.గ్రామాల పరిసరాల్లో చలి కారణంగా పంటకాల పనులు కూడా మందగించాయి. పొలాల్లో పనిచేసే రైతులు ఒక చేత కాల్చుకుంటూ, మరో చేత పని చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది."చలి ఎంత పెరిగితే అంత ఆగని ఆకలి పట్టినట్టు వణుకుతున్నాం" అని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రజలు ప్రస్తుతం స్వెటర్లు, దుప్పట్లు, మఫ్లర్లు, షాల్లు లేనిదే ఒక్క అడుగు కూడా బయట పెట్టలేని పరిస్థితి నెలకొంది. రాత్రివేళ చలి మరింతగా పెరగడంతో అనేక గ్రామాల్లో ప్రజలు మంటలు వేసుకుని రాత్రంతా మెలకువతో గడపాల్సి వస్తోంది.స్థానిక వైద్యులు చిన్నారులు, వృద్ధులు బయటకు వెళ్లేటప్పుడు తప్పనిసరిగా వెచ్చని దుస్తులు ధరించాలని, ఉదయపు పూటలో బయట పనులను వీలైతే తగ్గించుకోవాలని సూచిస్తున్నారు.చలి తీవ్రత ఇంకా కొన్ని రోజులు కొనసాగుతుందని అంచనా, దీంతో మండల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్న...

# నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్నటువంటి ప్రైవేట్ విద్యాసంస్థలను తక్షణమే మూసివేయాలి

● విసికె విముక్త చిరుతల పార్టీ రాష్ట్ర యూత్ అధ్యక్షులు అంబాల అనిల్ కుమార్ డిమాండ్



**చిట్యాల నవంబరు 17(పిసిడబ్ల్యూ న్యూస్):** ఉమ్మడి జిల్లాల వ్యాప్తంగా ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలు sc st bc ముస్లిం మైనారిటీ అగ్రవర్ణ పేదల బహుజన వర్గాల పేద విద్యార్థుల తల్లిదండ్రుల దగ్గర నుంచి ప్రైవేట్ స్కూల్ల యజమానులు ప్రైవేట్ కాలేజీ విద్యాసంస్థల యజమానులు పేద విద్యార్థుల తల్లిదండ్రుల దగ్గర నుంచి ఫీజుల పేరుతో ప్రైవేట్ బస్సుల పేరుతో బుక్స్ పేరిట లక్షల రూపాయలు వసూలు చేస్తున్నటువంటి ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన vck పార్టీ రాష్ట్ర యూత్ అధ్యక్షులు అంబాల అనిల్ కుమార్ ఉమ్మడి జిల్లాల వ్యాప్తంగా ఉన్నటువంటి ఆయా జిల్లా పరిధిలో ఉన్న కలెక్టర్లు డీఈవోలు వెంటనే స్పందించాలి లేదంటే vck యూత్ విభాగం విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో విద్యాసంస్థల ముందు ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఒక ప్రకటనలో తెలియజేశారు ఫీజుల పేరుతో పేద విద్యార్థుల దగ్గర నుండి లక్షల రూపాయలు దోపిడీ చేస్తున్నారు ఈ విషయంపై వివిధ జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి ప్రభుత్వ నియమ నిబంధనలో పాటించని ప్రైవేట్ విద్యాసంస్థలపై చట్టపైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు.

# ఆదరణ కూడికకు హాజరైన సండ్ర....



**తల్లాడ, నవంబర్17 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మండల పరిధిలో గొల్లగూడెం గ్రామానికి చెందిన ఇస్నేపల్లి అప్పయ్య(అలెగ్జాండర్) కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన ఆదరణ కూడికకు సత్తుపల్లి మాజీ శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య హాజరయ్యారు.ఇటీవల కాలంలో వారు మరణించడంతో వారి కుటుంబములో ఏర్పాటు చేసిన ఆదరణ కూడికలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన జరిగిన సంఘటన గురించి పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు.వారి సతీమణిని,కుమారులను, కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు.కార్యక్రమంలో టిఆర్ఎస్ మండల అధ్యక్షులు రెడ్డిం వీర మోహన్ రెడ్డి, కోడూరు వీర కృష్ణారెడ్డి,గొల్లమండల సింహాద్రి,ఇస్నేపల్లి వీరయ్య,శేషయ్య,అశోక్,నరసింహారావు,లక్ష్మణరావు పలువురు ప్రముఖులు పాల్గొని నివాళులర్పించారు.

# హుస్సేన్‌ను పరామర్శించిన జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత..



**తల్లాడ, నవంబర్17 (పిసిడబ్ల్యూ న్యూస్) :**తెలంగాణ జాగృతి యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి షేక్ హుస్సేన్ ను తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పరామర్శించారు. సోమవారం ఖమ్మంజిల్లా తల్లాడ మండలం కుర్నవల్లి గ్రామంలో స్వగృహంలో ఆయనను పరామర్శించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో హుస్సేన్ కాలుకు గాయమైన విషయం విధితమే. ఈ విషయం తెలుసుకున్న ఆమె ఆయనను పరామర్శించి ఆరోగ్య యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులను ఆమె పేరుపేరునా పలకరించారు. అక్కడకు వచ్చిన మహిళలతో కొద్దిసేపు ముచ్చటించి ఏం చేస్తారని అడిగి తెలుసుకున్నారు. హుస్సేన్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట తెలంగాణ ఉద్యమ నాయకులు తొండపు రవికుమార్, వినయ్ కుమార్, సురేష్ బాబు, రవి, జంపాలా కృష్ణ, సైదులు, రఫీ, జానీపాషా తదితరులు పాల్గొన్నారు.

# పమ్మి కృష్ణకు నివాళి: కాంగ్రెస్ నాయకులు పసుమర్తి

**కల్లూరు,నవంబర్17(పిసిడబ్ల్యూ న్యూస్):**మున్సిపాలిటీ పరిధిలో గోపాల దేవ బోయనపల్లికి చెందిన పమ్మి కృష్ణ బౌతికాయాన్ని దర్శించి ఆర్యవైశ్య జిల్లా అధ్యక్షులు కాంగ్రెస్ సీనియర్ నాయకులు పసుమర్తి చందర్ రావు శ్రద్ధాంజలి ఘటించారు.గత రాత్రి గుండె నొప్పితో మరణించగా విషయం తెలుసుకున్న పసుమర్తి గోపాల దేవబోయిన పల్లి లోని కృష్ణ స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు .ఈ కార్యక్రమం లో కోటిరెడ్డి, ఉబ్బన రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.



# ఉత్కంఠ భరితానికి ముగింపు

**ముగిసిన ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికలు.. వెలువడిన ఫలితాలు**

**అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా కురువెళ్ల ప్రవీణ్ కుమార్, జీవై నరేష్**

**ఎన్నికల అనంతరం అందరం సమానమే : అధ్యక్ష కార్యదర్శులు**










**ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :** చాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికలు ఈ సంవత్సరం అత్యంత ఉత్కంఠ భరితంగా, నువ్వా నేనా అన్న రీతిలో పోటా పోటీగా కొనసాగాయి. మూడేళ్లకు ఒకసారి జరిగే చాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికలు పోటీతత్వాన్ని పెంచుతూ ఒక నూతన వరవడిని సృష్టిస్తున్నాయి. మంచి వ్యక్తిత్వం, వ్యాపార అనుభవాలు, నాయకత్వ లక్షణాలు కలిగిన వ్యక్తులను ఎన్నుకోవడం ఆనవాయితీగా మారింది. చాంబర్ ఆఫ్ కామర్స్ 2025 ఎన్నికలు నవంబర్ 16 ఆదివారం ఉత్కంఠ భరితంగా సాగినప్పటికీ పోలీస్ బందోబస్తు మధ్య ఎన్నికల అధికారి పిబి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఫలితాలు వెలువడి ప్రశాంతంగా ముగిసింది. శాఖల వారిగా ఫలితాలు ప్రకటించారు. ఖమ్మం వర్తక సంఘం(చాంబర్ ఆఫ్ కామర్స్) అధ్యక్షుడిగా కురువెళ్ల ప్రవీణ్ కుమార్ ఎన్నికయ్యారు. ప్రవీణ్ కు 725 ఓట్లు రాగా, ఆయన ప్రత్యర్థి మేళ్లచెరువు వెంకటేశ్వరరావుకు 506 ఓట్లు వచ్చాయి. ప్రవీణ్ 219 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ప్రధాన కార్యదర్శిగా జీవై నరేష్ తన సమీప ప్రత్యర్థి గొడవర్తి శ్రీనివాసరావుపై 96 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎన్నిక కావడంతో కేరింతలు, బాంబుల మోతలతో చాంబర్ ఆఫ్ కామర్స్ కోలాహాలంగా మారింది. ఉపాధ్యక్షుడిగా బత్తిని నరసింహారావు, తన సమీప ప్రత్యర్థి లక్ష్మీ కాంతారావుపై 67 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. సహాయ కార్యదర్శిగా బాదే రమేష్ తన ప్రత్యర్థి ముత్యం ఉప్పల్ రావు పై 115 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. కోశాధికారిగా తల్లాడ రమేష్ తన ప్రత్యర్థి లక్ష్మీ నరసింహారావు పై 20 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఎన్నికలు అత్యంత ఉత్కంఠ భరితంగా సాగినప్పటికీ.. ఎన్నిక అనంతరం అందరూ కలిసి మెలసి వ్యాపారాలు చేసుకోవడం, యధావిధిగా, బేధాభిప్రాయాలు లేకుండా ఎవరి విధులు వారు నిర్వర్తించుకోవడం గొప్ప విశేషం. గత నెల రోజులుగా ఉత్కంఠ రేపుతున్న ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికలు ఆదివారంతో ఉత్కంఠకు తెరపడింది. సెంట్రల్ ఈసీ సభ్యులుగా మాటేటి కిరణ్ 669, రాయపూడి రవి 626, వంగవీటి హరీష్ 617, సుకాశి శేషగిరిరావు 593, పోట్ల రామనాథం 586 ఓట్లతో గెలుపొందారు.**అనుబంధ శాఖల విజేతలు :** ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ లో 18 అనుబంధ శాఖలు ఉండగా మొత్తం 13 శాఖలు ఇప్పటికే ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యాయి. మిగతా ఐదు శాఖలకు ఆదివారం జరిగిన ఎన్నికల్లో దిగుమతి శాఖ అధ్యక్ష కార్యదర్శులుగా వడ్డే వెంకటేశ్వర్లు, ఎర్ర అప్పారావు ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా సిరికొండ వెంకటేశ్వర్లు, బండి సతీష్, జుట్టుకొండ చైతన్య, రావుల శ్రీను, శంకర్ మల్లెల అప్పారావు, కందిబండ నరసింహారావు, బాల్తు సంపత్ ఎన్నికయ్యారు. ఎగుమతిశాఖ అధ్యక్ష కార్యదర్శులుగా నల్లమల ఆనంద్ బైరి, శెట్టి శ్రీనివాస్ ఎన్నికయ్యారు. మిర్చిశాఖ అధ్యక్ష కార్యదర్శులుగా మెంతుల శ్రీశైలం, యడ్లపల్లి సతీష్ ఎన్నికయ్యారు. బంగారం వెండి శాఖ అధ్యక్ష కార్యదర్శులకు బందు సూర్యం, నగరికంటి సతీష్ లు ఎన్నికయ్యారు. సామిల్ శాఖ అధ్యక్ష కార్యదర్శులుగా భాస మల్లికార్జున్, రెడ్డిబోయిన శ్రీను ఎన్నికయ్యారు. మొత్తం 1305 ఓట్లకు గాను 1289 మంది ఓటర్లు ఓటు హక్కు ను వినియోగించుకున్నారు.



# సింగరేణి సంస్థకు బొగ్గు బ్లాకులు కేటాయించి కాపాడాలి : కల్వకుంట్ల కవిత





**సత్తుపల్లి, నవంబర్17 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కేంద్ర ప్రభుత్వం సింగరేణి సంస్థకు బొగ్గు బ్లాగులు కేటాయించి సంస్థను ఆదుకోవాలని తెలంగాణ జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. సోమవారం నాడు జాగృతి హెచ్ఎంఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన జనం బాట కార్యక్రమంలో భాగంగా సింగరేణి గనిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె సింగరేణి కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ గత కేసీఆర్ ప్రభుత్వం అనేక మార్పులు తీసుకురావడంతో అనేక మంది యువత సింగరేణిలో ఉద్యోగ అవకాశాలు పొందారని గత రెండేళ్ల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ఇండిపెండెంట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయడంలో విఫలమైందని వెంటనే కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని ఆమె డిమాండ్ చేశారు. సింగరేణి ఉద్యోగుల సొంత ఇంటి కలను నెరవేర్చాలని సింగరేణి ఉద్యోగుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని మెడికల్ బోర్డు ఏర్పాటుతోపాటు హైదరాబాదులో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని నిర్మించాలని తద్వారా కార్మికుల కు కార్పొరేట్ వైద్యం అందించాలని ఆమె డిమాండ్ చేశారు. సింగరేణి కార్మికులకు ఇన్కమ్ టాక్స్ రద్దు చేయాలని సింగరేణి సంస్థకు టెండర్ వేలం లేకుండా బొగ్గు బ్లాగులను కేటాయించాలని కోరారు.

# సమాజంలో విద్యార్థులు ఉన్నతంగా ఆలోచించాలి

**● రోడ్డు భద్రత, మొక్కలు నాటు కార్యక్రమంపై అవగాహన సదస్సు**




**కల్లూరు, నవంబర్17 (పిసిడబ్ల్యూ న్యూస్) :**భద్రాద్రి కొత్తగూడెం ఎంవీఐ సంఘం వెంకట పుల్లయ్య వారి తల్లిదండ్రుల 17వ వర్ధంతి సందర్భంగా కల్లూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు యువ వికాసం ప్రేరణ కార్యక్రమం, రోడ్డు భద్రత, మొక్కలు నాటు కార్యక్రమంపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ షకీలా భాను అధ్యక్షతన నిర్వహించిన ఈ అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా సిహెచ్ వి శివప్రసాద్, ఎంవిఐ వెంకట పుల్లయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిహెచ్ వి శివప్రసాద్ మాట్లాడుతూ.. విదార్థుల మానసిక స్థితి, ఉపాధ్మాయులు, తల్లిదండ్రుల పై విద్యార్థుల ప్రవర్తన భవిషత్తులో యువత యొక్క ప్రాధాన్యత సమాజంపై ఎలా ఉంటుంది అనే అంశాలను వివరించారు. ఎం.వి.ఐ వెంకట పుల్లయ్య టీజీవో అధ్యక్షులు మాట్లాడుతూ మానవాళికి మొక్కలు ఏ విధంగా ఉపయోగపడతాయో ప్రమాదాలు జరగకుండా ప్రమాదాలు ఎలా నివారించాలో పలు అంశాలను విద్యార్థులకు తెలిపారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు ఎలాంటి సహాయా సహకారాలు అందించాలో క్షతగాత్రులను ఎలాంటి చికిత్స అందించాలి తదితర అంశాలను విద్యార్థులకు వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు కళాశాలకు క్రమం తప్పకుండా హాజరై, ఉత్తమ ఉత్తీర్ణత సాధించాలని చదువు యొక్క ప్రాముఖ్యతను సమాజంలో చదువుకున్న గౌరవాన్ని వివరించారు. విద్యార్థులు ఉన్నతంగా ఆలోచించి, తమ భవిష్యత్తుకు వారే పునాదులు వేసుకోవాలని జీవితంలో ఏది సాధించాలన్న చదివే ముఖ్యమని, బావి భారత పౌరులు మీరే అని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు కిరణ్,వీరబద్రం, ప్రసన్న, శ్రీరాములు, రాజు కళావతి, రంజిత్, రషాదేవి,లయన్స్ క్లబ్ కొత్తగూడెం మిలీనియం అధ్యక్షులు లయన్ బొక్క శ్రీనివాస్, లయన్స్ క్లబ్ ఆఫ్ కల్లూరు అధ్యక్షులు లయన్ నాగేంద్ర బాబు, లయన్ లీడర్స్ లయన్ జెబి మోహన్, లయన్ రాజయ్య గబ్బెట, లయన్ నరసింహ రావు తదితరులు పాల్గొన్నారు

# భక్తిశ్రద్ధలతో 5వ కార్తీకమాస వనమహోత్సవం



కులమతాల కతీతంగా ప్రత్యేక పూజలు

ఖమ్మం గ్రానైట్ ట్రేడర్స్ అండ్ మార్కర్ అసోసియేషన్ నూతన పాలకవర్గం ఏర్పాటు



**నూతన అధ్యక్ష కార్యదర్శులుగా నూనావత్ కిషన్, ఎస్.కె జానీ**

**ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఖమ్మం గ్రానైట్ ట్రేడర్స్ అండ్ మార్కర్ అసోసియేషన్ వారి 5వ కార్తీకమాస వనసమారాధన మహోత్సవం కులమతాల కతీతంగా ప్రత్యేక ప్రార్థనలతో సోమవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా సంఘం యొక్క నూతన పాలకవర్గాన్ని సంఘం గౌరవ సలహాదారులు అదాలత్ నరేంద్, వెంపటి వెంకటేశ్వర్లు, సంఘం గౌరవ అధ్యక్షుడు వెంపటి ఉపేందర్ ఆధ్వర్యంలో 5వ



వనసమారాధన మహోత్సవంతో పాటు నూతన పాలకవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది. **నూతన పాలక వర్గం సభ్యులు** అధ్యక్షులుగా నూనావత్ కిషన్, సెక్రటరీగా ఎస్.కె జానీ, ఉపాధ్యక్షులుగా ఎస్.కె పాషా, కత్రం శేషగిరి లు, కోశాధికారులుగా ఆకుల సైదులు, ఎం. రాంమ్మూర్తి, జాయింట్ సెక్రటర్లుగా ఎన్. నరసింహారావు, ఎం. హనుమంతరావు, ఈసీ మెంబర్లుగా వి. శ్రీను, డి. దిలీప్, ఎ. శ్రీకాంత్, ఎల్.కె. వెంకటేష్, కె. రమేష్, జి. అంజి, ఫయాజ్ ఖాన్, అలీమ్ లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా సంఘము ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తదుపరి సభ్యులందరూ సహపంక్తి భోజన కార్యక్రమం నిర్వహించారు.

# చంద్రికకు బాలసాహిత్య పీఠం పురస్కారం

**చంద్రిక బాలల కథల పుస్తకానికి నగదు బహుమతితో పాటు పురస్కారం**

**అభినందించిన ఎన్ఎస్పి ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం దుర్గా భవాని, ప్రోత్సహించిన గురువు కొండ్రు బ్రహ్మం**

**ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :** బాల సాహిత్యంలో ఎన్.ఎస్.పి కాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థిని చిరంజీవి చంద్రిక రాసిన 'కథా చంద్రిక బాలల కథల పుస్తకానికి' గాను శ్రీవాణి సాహిత్య పరిషత్తు పెందోట బాలసాహిత్య పీఠం సిద్దిపేట వారు పురస్కారాన్ని అందించడం అభినందనీయమని ఎన్ఎస్పి ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం దుర్గా భవాని, చంద్రికను ప్రోత్సహించిన గురువు కొండ్రు బ్రహ్మంలు అన్నారు. సిద్దిపేటలో నవంబర్ 16 ఆదివారం నాడు జరిగిన బాలసాహిత్య సమ్మేళనంలో పెందోట సాహిత్య పీఠం వారు పదవ తరగతి విద్యార్థిని కుమారి చంద్రిక రాసిన 'బాల సాహిత్య కథా



పుస్తకానికి' అవార్డుతో పాటు నగదు బహుమతిని అందజేసి ఘనంగా సత్కరించారు. తెలంగాణలో విస్తృతంగా బాల సాహిత్యం వెలువడుతున్న నేపథ్యంలో చంద్రిక కథల పుస్తకంకు పురస్కారం రావడం ఆనందదాయకమని బాల సాహితి వేత్తలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమ నిర్వాహకులు పెందోట వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... చంద్రిక వాస్తవానికి దగ్గరగా కథలు రాసిందని చేయి తిరిగిన పెద్దలు రాసినట్లుగానే కథలు అద్భుతంగా రాసిందని చంద్రకను అభినందించారు. ముఖ్యఅతిథి గరిపల్లి అశోక్, వాసర వేణి పరశురాములు మాట్లాడుతూ.. అందరిని అభినందిస్తూ



చిన్నారి చంద్రిక రాసిన కథలు చాలా అద్భుతంగా ఉన్నాయని ప్రశంసించారు. భవిష్యత్తులో మరిన్ని కథలు రాసి సాహితి చరిత్రలో చంద్రిక తన పేరును లిఖించుకున్నదని తెలిపారు. కథలు రాయడానికి ఎంతగానో ప్రోత్సహించిన చంద్రిక గురువు కొండ్రు బ్రహ్మంను ప్రత్యేకంగా అభినందించారు. చంద్రికకు పురస్కారం రావడం ఖమ్మం జిల్లాకు ఎంతో గర్వకారణమని ఖమ్మం జిల్లా బాలసాహితీవేత్తలు, సాహిత్య ప్రియులు, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. చంద్రిక చదువుతున్న ఎన్.ఎస్.పి కాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు దుర్గా భవాని చంద్రికను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో చంద్రికను కథలు రాయడానికి ప్రోత్సహించిన కవి, రచయిత, బాల సాహిత్య వేదిక కన్వీనర్, తెలుగు ఉపాధ్యాయులు కొండ్రు బ్రహ్మం, రాధిక,మేనమామ మహేందర్ రెడ్డి, బంధు మిత్రులు పాల్గొన్నారు.

# ఘనంగా విశ్వకర్మ ఎంప్లాయిస్ వనసమారాధనోత్సవం





**ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :** శివునికి ఎంతో ప్రీతిపాత్రమైన కార్తీక మాస వనభోజనాల సందర్భంగా విశ్వకర్మ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఖమ్మం నగరంలోని చెరుకూరి మామిడి తోటలో వన సమరాధనోత్సవం ఆటపాటలు సాస్కృతిక కార్యక్రమాలతో ఎంతో ఘనంగా నిర్వహించారు. ఉదయం వనదేవతకు పూజలు చేసి ఉసిరి చెట్టు వద్ద పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అర్చకులు దోనోజు పరిపూర్ణాచారి ఆధ్వర్యంలో శివలింగానికి ప్రత్యేక అభిషేకాలు చేసి విశిష్ట పూజలు నిర్వహించారు. అనంతరం కార్యక్రమం నిర్వాహకులు విశ్వనాధులు పాపాచారి, కన్నోజు గురుబ్రహ్మం, రామడుగు ఆదిశేషు, కన్నోజు సువర్ణ ప్రసాద్, పమ్మి వెంకటేశ్వరరావు, వజ్రాల కిరీటీచారి ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులను మెమొంటో అందజేసి శాలువాలతో సన్మానించారు. మహిళలు, చిన్నారులకు నిర్వహించిన ఆటల పోటీలు, సాంస్కృతి కార్యక్రమాలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో వారు మాట్లాడుతూ.. విశ్వబ్రాహ్మణ విశ్వకర్మల విశిష్టతను తెలియజేశారు. విశ్వబ్రాహ్మణులకు ప్రభుత్వం నుంచి అందాల్సిన సంక్షేమ పథకాలను పటిష్టంగా అమలు చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుండి తమవంతుగా ప్రయత్నించాలన్నారు.



# కన్నుల పండువగా ఆకుతోట వారి రిసెప్షన్ వేడుక

- ఆత్మీయులు, అతిరథమహారథుల రాకతో రిసెప్షన్ సందడి





**ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :** సీనియర్ జర్నలిస్ట్, తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ, అరుణ దంపతుల ప్రథమ పుత్రుడు అన్వేష్ తో విధిత ల వివాహ వేడుక అంగరంగ వైభవంగా శనివారం హైదరాబాద్ లో ఘనంగా జరిగింది. కాగా అన్వేషణ , విధితల రిసెప్షన్ వేడుక ఖమ్మంలోని ఎస్సార్ గార్డెన్స్ లో సోమవారం రాత్రి అట్టహాసంగా జరిగింది. కనుల పండుగ జరిగిన ఈ వేడుకకు ఖమ్మం రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, ఎమ్మెల్సీ తాత మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, మాజీ ఎమ్మెల్సీలు బాలసాని లక్ష్మీనారాయణ, కొండబాల కోటేశ్వరరావు, వార్త రీజినల్ మేనేజర్ జెవి రత్నం దంపతులు, స్తంభాద్రి బ్యాంకు చైర్మన్ చెరుకూరి కృష్ణమూర్తి, ప్రముఖ విద్యావేత్త పారుపల్లి ఉషా కిరణ్, రవి మారుత్, మాస్ లైన్ రాష్ట్ర నేత పోటు రంగారావు, గ్రానైట్ అసోసియేషన్ నాయకులు పారా నాగేశ్వరరావు, ఆకుల గాంధీ, మాజీ సుడా చైర్మన్ బి. విజయ్ కుమార్, జర్నలిస్టులు, వివిధ పార్టీలకు చెందిన రాజకీయనేతలు, నగర ప్రముఖులు, ఆత్మీయులు, అతిరథమహారధులు, జర్నలిస్టులు, బంధుమిత్రులు పెద్ద ఎత్తున తరలివచ్చి నూతన వధూవరులను ఆశీర్వదించారు.



# చంద్రుపట్లలో జోరుగా ధాన్యం కొనుగోలు

- 50 శాతం కొనుగోలు చేసిన సొసైటీ





**కల్లూరు, నవంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కల్లూరు మండలం చెన్నూరు సొసైటీ పరిధిలోని చందుపట్ల గ్రామంలో సొసైటీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు జోరుగా సాగుతుంది. గత 15 రోజుల నుండి 50శాతం పైగా ధాన్యం కొనుగోలు చేసినట్లు రైతులు తెలిపారు. ఎవరికీ ఎలాంటి ఇబ్బంది కలగకుండా ధాన్యం కొనుగోలు జరుగుతుందని రైతులు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. వచ్చే పది రోజుల్లో పూర్తిగా ధాన్యం కొనుగోలు జరుగుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వము నుండి మద్దతు ధర సకాలంలో అందుతుందని వారు తెలిపారు. మండల వ్యాప్తంగా చంద్రుపట్ల గ్రామంలో ధాన్యం కొనుగోలు ఎక్కువ శాతం జరిగింది. గన్ని సంచులు సరఫరాలో కూడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందుతున్నాయని సంబంధిత రైతులు తెలిపారు.

# జనవాసాల మధ్య వైన్ షాపును తొలగించండి

- ప్రజావాణిలో దరఖాస్తు ఇచ్చిన చెన్నూరు గ్రామ ప్రజలు






**కల్లూరు, నవంబర్17 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మండల పరిధి చెన్నూరు ప్రధాన సెంటర్లో జనవాసాల మధ్య ఏర్పాటుచేసిన వైన్ షాపును తొలగించాలని తాసిల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో చెన్నూరు గ్రామ ప్రజలు ఎంపీడీవో చంద్రశేఖర్కు దరఖాస్తు అందించారు. ఈ సందర్భంగా ప్రజావాణికి వచ్చిన ఎక్సైజ్ అధికారులకు కూడా వినతిపత్రం అందించారు. వైన్ షాప్ జనవాసాల మధ్య ఏర్పాటు చేయడం వల్ల విద్యార్థులు, మహిళలు ఇబ్బంది పడుతున్నారని, రోడ్డుకు ఇరువైపులా మోటార్ సైకిల్ పెట్టడం వల్ల ట్రాఫిక్ ఇబ్బంది అవుతుందని ఇండ్ల మధ్య తాగిన సీసా బాటిల్ పడేస్తున్నారని, పొలాలకు వెళ్లి వచ్చే వారు ముందుబాబులను చూసి భయపడుతున్నారని, అంతేకాకుండా పశువులు, దుక్కిటెడ్లు వైన్ షాప్ ముందు జనాలని చూసి బెదిరిపోతున్నాయని వారి ఆవేదన వ్యక్తం చేశారు. మాకు ఆడపిల్లలు ఉన్నారని, వారి రక్షణ నిమిత్తం అధికారులు స్పందించి అట్టి వైన్ షాపును వేరే ప్రాంతంలోకి తరలించాలని ప్రభుత్వ అధికారులను వేడుకున్నారు.

# 58వ గ్రంధాలయ వారోత్సవాలు

**సిరివెళ్ల నవంబర్17 (పిసిడబ్ల్యూ న్యూస్) :**మండల కేంద్రంలోని స్థానిక గ్రం థలయంలో58 వ గ్రంథలయ వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. వారోత్సవాల ను పురస్కరించు కొని గ్రంథాల యం లో మన జాతీయ నాయకుల చిత్రపటా లకు పూల మాలవేసి స్మరించుకున్నారు. లైబ్రరీయన్ సార్ మహమ్మద్ రఫీ, రిటైర్డ్ మాస్టర్ రామకృష్ణ హై స్కూల్ వీద్యార్థులు పాల్గొన్నారు. రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులకు సెల్ ఫోన్ యెక నష్టాలు, పుస్తక పఠనం వళ్ళ లాభాలు గురిం చి వివరించారు. దేశ నాయకులు ఏవీదంగా స్వాతంత్రం కోసం పోరాటం చేశారోఅనే అనేక విష యాలు విద్యా ర్థులకు తెలియ చెప్పారు.రేపు 18.11.2025..వక్తృత్వ పోటీలు, చిత్రలేకణం, క్రీడలు, నిర్వహించి గెలుపొందిన విజేతలకు బహుమతులు ఇవ్వడం జరుగుతుందని లైబ్రరీన్ సుజాత తెలిపారు.

# కమ్మకులం ఎక్కడ ఉన్నా అక్కడ అభివృద్ధి జరుగుతుంది

**కృషి, నిబద్ధత, పట్టుదలే కమ్మవారి విజయ రహస్యం**

**రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

**అంగరంగ వైభవంగా, కనులవిందుగా కమ్మవారి వనమహోత్సవం**

**ఐకమత్యానికి ఆదర్శం కమ్మ మహాజన సంఘం**

**కమ్మవారి కష్టం ప్రపంచం గుర్తించిన విలువ**









**ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కమ్మ కులం ఎక్కడ ఉన్నా.. అక్కడ అభివృద్ధి జరుగుతుందని, కృషి, నిబద్ధత, పట్టుదలే కమ్మవారి విజయరహస్యం అని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. కార్తీకమాసం సందర్భంగా కమ్మ మహాజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం చేరుకూరి వారి మామిడితోటలో కుటుంబ సమేతంగా రావడంతో సందడి సందడిగా, అంగరంగ వైభవంగా, కన్నులవిందుగా కమ్మవారి వనసమారాధన కార్యక్రమం ప్రారంభమైంది. ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో కుటుంబాలు తరలివచ్చి పూజలు, వనభోజనాల్లో పాల్గొని కార్యక్రమానికి విశేష స్పందన చూపించారు. మామిడితోట మధ్య ప్రత్యేకంగా అలంకరించిన పూజా మండపం, దీపాలతో తీర్చిదిద్దిన దేవాలయ వాతావరణం కార్యక్రమానికి మరింత శోభను చేకూర్చింది. ఈ వనసమారాధన కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ... కమ్మ కులం ఎక్కడ ఉన్నా.. అక్కడ అభివృద్ధి జరుగుతుందని, కృషి, నిబద్ధత, పట్టుదలే అన్ని రంగాల్లో కమ్మవారు గుర్తింపు పొందుతున్నారని అన్నారు. వ్యవసాయాన్ని పునాది చేసుకుని రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలపరిచిన వర్గం కమ్మవారేనని గుర్తుచేశారు. గ్రామీణాభివృద్ధి, సాగు విస్తరణ, సామాజిక సేవల్లో కమ్మ సంఘాలు చేస్తున్న కార్యక్రమాలు ప్రశంసనీయమని తెలిపారు.

**కష్టమనేది కమ్మ కుల లక్షణం : ఎమ్మెల్సీ తాతా మధు**

వ్యవసాయం నుంచి ఐటీ వరకు ప్రతి రంగంలో కమ్మవారి ముద్ర స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ప్రపంచంలోని ఏ దేశానికెళ్లినా కమ్మవారు ఎదిగి తమ ప్రతిభను చాటుకుంటున్నారని అభిప్రాయపడ్డారు. కష్టం అనేది కమ్మ కుల లక్షణమని, అదే ఈ వర్గాన్ని ముందుకు నడిపే శక్తి అని పేర్కొన్నారు. యువత చరిత్రను తెలుసుకుని సమాజాభివృద్ధిలో బాధ్యతగా పాల్గొనాలని సూచించారు. ఈకార్యక్రమానికి మాజీ ఎంఎల్సీ పోట్ల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, టీజీవో రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు, టీడీపీ రాష్ట్ర నాయకులు వాసిరెడ్డి రామనాథం, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, బీజేపీ జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు ప్రత్యేక అతిథులుగా హాజరయ్యారు. వనసమారాధనలో సంప్రదాయబద్ధంగా నిర్వహించిన రుద్రాభిషేకం, దీపారాధన, వనపూజలు పాల్గొన్న వారిని ఎంతో ఆకట్టుకున్నాయి. కుటుంబసభ్యులు కలిసి పూజలు చేయడంతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. పిల్లల కోసం ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, మహిళల కోలాటాలు, హారతులు కార్యక్రమానికి మరింత అందాన్ని తీసుకొచ్చాయి. ఆదివారం రోజంతా మామిడి తోటలో సందడి సందడిగా సరదాగా గడిచిపోయింది. పాల్గొన్నవారందరికీ సంఘం తరపున సంతృప్తిగా వనభోజనం అందించారు. ఈ వనసమారాధన కార్యక్రమంలో కమ్మ మహాజన సంఘం అధ్యక్షులు కొల్లు రఘు సత్యనారాయణ, కార్యదర్శి చావా రాము, వైస్ ప్రెసిడెంట్ కర్ణాటి రమాదేవి, జాయింట్ సెక్రటరీ వజ్జా శ్రీనివాసరావు, కోశాధికారి తుళ్లూరి నిర్మలకుమారి, కార్యవర్గ సభ్యులు మోతుకూరి సత్యనారాయణ, తుమ్మలపల్లి నాగేశ్వరరావు, మేదరమెట్ల స్వరూపరాణి, నల్లమల ఆనంద్, నంబూరి సత్యనారాయణ ప్రసాద్, డాక్టర్ పోతినేని భూమేశ్వర్‌రావు, కోలేటి నవీన్, తాళ్ళూరి మురళీకృష్ణ, బండి రవికుమార్ తదితర సంఘ పెద్దలు, ప్రముఖులు పాల్గొన్నారు.

# గెలుపుతో సమస్యలు విస్మరించరాదు !

తెలంగాణలో కేవలం కెసిఆర్, కెటిఆర్ అహంకారం వల్లనే ప్రజలు కాంగ్రెస్‌కు ఓటేసారు. అదికూడా బండి సంజయ్‌ను బిజెపి అధ్యక్షుడిగా తొలగించడంతో బిజెపి వైపు ఉన్న సానుకూల పవనాలు రేవంత్ వైపు చూపించారు. ఇది రెండేళ్ల క్రితం నాటి ఎన్నికల ముందు పరిస్థితి. ఇందులో ఎలాంటి అనుమానాలకు తావు లేదు. ఎందుకంటే బండిని తొలగిచగానే బిజెపి, బిఆర్ఎస్ కుమ్మక్కయ్యయాని క్షేత్రస్థాయిలో కూడా ప్రజలు చర్చించుకుని ముక్కున వేలేసుకున్నారు. అందుకే అటు బిజెపిని, ఇటు బిఆర్ఎస్‌ను దెబ్బకొట్టి కాంగ్రెస్‌కు అవకాశం ఇచ్చారు. రెండేళ్లు కావస్తోంది. ఈ రెండేళ్లలో రెండు ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించింది. మొన్నటి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కూడా ప్రజలు రేవంత్‌ను నమ్మి గెలిపించారు. ఇది కూడా కేవలం రేవంత్ వ్యూహం వల్లనే అని చెప్పక తప్పదు. అయితే అన్నింటికిమించి ఆరు గ్యారెంటీ లను ప్రస్తావిస్తూ..అన్ని హామీలను నెరవేర్చామని కాంగ్రెస్ పదేపదే ప్రకటిస్తోంది. క్షేత్రస్థాయిలో ఉన్న అనేక సమస్యలను అసలు పరిష్కారం దిశగా చూడడం లేదు. ధరణి పోయి భూమాత వచ్చినా సమస్యలు అలాగే ఉన్నాయి. అనేక భూ సమస్యలు పరిష్కారం కావడం లేదని వార్తలు ప్రచురితం అవుతున్నా పట్టించు కోవడం లేదు. దేవాదాయ శాఖ భూములు వేలాది ఎకరాలు అన్యాక్రాంతం అయ్యాయి. వాటి గురించి దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకే తెలియదు. అసలు దేవాదాయ శాఖలో ఏం జరుగుతుందో ఆమె తెలుసుకునే ప్రయత్నం కూడా చేయడం లేదు. అటవీ భూములు పరిస్థితి అలాగే ఉంది. రోడ్ల పరిస్థితి అధ్వాన్నంగా ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా రోడ్లు దెబ్బతిన్నాయి. హైదరాబాద్‌లో రోడ్ల అధ్వానంనం గురించి మంత్రి కోమటిరెడ్డికి కూడా పట్టింపు లేదు. అంతెందుకు వరంగల్ హైవేలో రోడ్డను బాగు చేద్దామన్న సోయి లేదు. లంచం ఇవ్వనిదే ఉద్యోగులు ఏ పనీ చేయడం లేదు. ఉద్యోగులను గట్టిగా అదిలించ లేకపోతున్నారు. ఒకరిద్దరు ఎసిబికి చిక్కుతున్నా అది ప్రభావం చూపడం లేదు. గ్రామాల్లో తెల్లరేషన్ కార్డు విధానం తీవ్రంగా






దుర్వినియోగం అవుతోంది. రేషన్ బియ్యం కొత్త వ్యాపార దందాకు తెరతీసింది. దీనిపై పౌరసరఫరాలశాఖ మంత్రికే తెలియడం లేదు. ఏం జరుగుతుందో తెలుసుకునే ప్రయత్నం చేయడం లేదు. ఇవి మచ్చుకు తీసుకుని చర్చిస్తున్న అంశాలు మాత్రమే. ఫీజు రియంబర్స్‌మెంట్ దోపిడీ, ఆరోగ్యశ్రీ దోపిడీలు చెప్పాల్సిన పనిలేదు. ఇవన్నీ కూడా సిఎంగా రేవంత్ రెడ్డిపైనే ప్రభావం చూపుతాయి. మంచి జరిగితే ఎలాగైతే పేరు వస్తుందో చెడు జరిగినా సిఎంగా రేవంత్‌పైనే ప్రభావం చూపుతాయి. ఎంతసేపు ఉప ఎన్నికల్లో గెలిచమనో, బిసి రిజర్వేషన్లను అమలు చేశామనో లేఓ అమలు చేయబోతున్నామనో చెబితే సమస్యలను పరిష్కరించి నట్లు కాదు. చిన్న సమస్యను కూడా సీరియస్‌గా తీసుకని పరిష్కరించాలి. ఇల్లు అలకగానే పండగ కాదన్నట్లు ఒక ఉప ఎన్నికను సర్వశక్తులూ ఒడ్డి గెలిచనంత మాత్రాన అంతా అనుకూలంగా ఉందని భావిస్తే భారీ మూల్యం చెల్లించాల్సి ఉంటుంది. తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతానికి రేవంత్‌రెడ్డి పైచేయి సాధించారు. అందులో అనుమానం లేదు. అలాగని ప్రజాభిమానాన్ని చూరగొనడానికి ఆయన ఇంకా ప్రయత్నించాలి. ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వసనీయత పెంచేలా ఆయన వెంటనే చర్యలు తీసుకోవాలి. పార్టీలో క్రమశిక్షణ నెలకొల్పడంతో పాటు, మంత్రులను పనిచేసేలా అదిలించాలి. రెండేళ్ల వార్షికోత్సవం జరుపుకోవడానికి ముందు ఈ రెండేళ్ల పాలనలో మంచి చెడులను సమీక్షించుకోవాలి. మధ్య తరగతి, ఆపై వర్గాల ప్రజల్లో ప్రభుత్వం పట్ల వ్యతిరేకత ఉంది. హైదరాబాద్ నగర్ సమస్యలపై దృష్టి పెట్టడం ద్వారా ప్రజల మనసు గెలుచుకోవాలి. ఉప ఎన్నిక అంటే పార్టీ యంత్రాంగం అంతా మోహరిస్తుంది. సాధారణ ఎన్నికల్లో అలా చేయడం సాధ్యం కాదు. వనరులు కూడా అంతంత మాత్రంగానే ఉంటాయి. గ్రామీణ ప్రాంతాల్లో కూడా ప్రభుత్వంపై కొంత వ్యతిరేకత వస్తోంది. సాధారణ ఎన్నికలకు ఇంకా మూడేళ్ల వ్యవధి ఉన్నందున ఈ పరిస్థితిని అధిగ మించడానికి అవకాశం ఉంది. హైదరాబాద్‌లో జూబ్లీహిల్స్ గెలవడంతో ఇక అంతా మంచి చేశామని, ప్రజలు తమవెంటే ఉన్నారని, కెసిఆర్ పని అయిపోయిందని అంటే ప్రజలు సహించరు. ముఖ్యమంత్రిగా రాష్ట్రంలోని మిగతా నియోజకవర్గాల ప్రజల మనోగతం తెలుసు కోవాలి. ప్రజల్లో ఏయే అంశాలపై అసంతృప్తి ఉందో తెలుసుకునే ప్రయత్నం చేయాలి. ఇప్పుడు పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ తన స్థానం పటిష్ఠం అయినందున ప్రజలకు సంబంధించిన సామాన్య సమస్యలపై దృష్టి సారించాలి. అయితే కాంగ్రెస్ అధిష్ఠానం వద్ద రేవంత్‌రెడ్డి పరపతి పడిపోతోందని ప్రచారం చేసిన వారికి జూబ్లీఅహిల్ విజయంతో సమాధానం చెప్పారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందన్న ప్రచారం గత కొంత కాలంగా జోరుగా జరుగుతోంది. ఈ పరిస్థితులలో ఈ విజయం కాంగ్రెస్ పార్టీకి లాభించడం ఎలా ఉన్నా రేవంత్‌రెడ్డి ప్రతిష్ఠ పెరగడానికి మాత్రం దోహదం చేసిందనే చెప్పాలి. ఇదే సమయంలో ఇటు ప్రభుత్వంలో, అటు పార్టీలో రేవంత్ పట్టు సాధించాలి. బిహార్ ఫలితాల తర్వాత కాంగ్రెస్ పరిస్థితి మరింత దారుణంగా మారింది. బిహార్ ఫలితాల తర్వాత కాంగ్రెస్ అధిష్ఠానం పైనే ఆ పార్టీ నాయకులు, శ్రేణులకు నమ్మకం పోయే పరిస్థితి ఏర్పడింది. ఈ రెండేళ్లుగా తనను ఎవరు ఎన్ని విధాలుగా విమర్శించినా, హేళన చేసినా రేవంత్‌రెడ్డి ఓపికతో వెళుతున్నారు. అవకాశం కోసం ఎదురుచూస్తూ వచ్చారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక రూపంలో ఆయనకు ఆ అవకాశం వచ్చింది. ఆత్మవిశ్వాసం తో,పదునైన వ్యూహ రచనతో విజయాన్ని అందుకున్నారు. అయితే జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ఫలితంతో రాష్ట్ర రాజకీయాలలో గానీ, ప్రజల జీవితాలలో గానీ మార్పులు రావు. జూబ్లీహిల్స్‌లో ఓడిపోయి ఉంటే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కూలిపోక పోయినా, వ్యతిరేకత మాత్రం విపరీతంగా పెరిగేది. రేవంత్‌రెడ్డి నాయకత్వా నికి ఇప్పుడు వచ్చిన ప్రమాదం లేదు. అయితే ఆయన ఎంతగా క్షేత్రస్థాయిలోకి వెళ్లగలిగితే అంతగా ప్రజల్లో స్థానం సాధిస్తారు. లేకుంటే ఈ మూడేళ్లలోనే గడ్డు పరిస్థితులు ఎదుర్కోక తప్పదు.


# బిజెపి, బిఆర్ఎస్ తీరుపై ప్రజల్లో ఆగ్రహం

**ఉప ఎన్నిక ఫలితమే ఇందుకు నిదర్శనం**

**కేంద్రమంత్రులు బండి, కిషన్ రెడ్డిలు ఆత్మపరిశీలన చేసుకోవాలి**

**కెటిఆర్ అతిగా ఊహించుకోవడం వల్లనే దెబ్బ**

**హైదరాబాద్,నవంబర్17:** రాష్ట్రంలో అధికారంలోకి వస్తామని భావిస్తున్న భారతీయ జనతా పార్టీ జూబ్లీహిల్స్‌లో డిపాజిట్ కోల్పోవడం పరిశీలిస్తే ఆశ్చర్యం కలిగిస్తోంది. గత ఎన్నికల్లో వచ్చిన ఓట్లలో ఐదు శాతం వరకు తగ్గిపోవడం ఏమిటి? బీజేపీ ఈ దుస్థితికి అంతర్గత కలహాలు ప్రధాన కారణమని భావించ వచ్చు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి రాష్ట్రానికి సంబంధించిన సమస్యలపై పెద్దగా స్పందించడం లేదు. సిఎం రేవంత్ నేరుగా ప్రస్తావించిన సమస్యలపైనా ఎదురుదాడితో పక్కదోవ పట్టిస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉండడంతో రాష్ట్ర సమస్యలను పెద్దగా పట్టించుకోవడం లేదు. పక్కరాష్ట్రం ఎపిలో బిజెపి నుంచి కేంద్ర మంత్రులు వచ్చి వాలుతున్నారు. చంద్రబాబు ఏది కోరితే అది చేసి పెడుతున్నారు. విజినరీ బాబు అంటున్నారు. విశాఖ ఉక్కు, అమరావతి, తుఫాన్ సాయం, పంటల కొనుగోళ్లు, మిర్చి రైతుల సమస్యలు ఇలా ఒక్కటేంటి..ఏది అడిగిన కాదనకుండా కేంద్రం ఎస్ సమాధానంతో సిద్దంగా ఉంది. తెలంగాణలో ఇద్దరు కేంద్రమంత్రులు ఉన్నా ఒక్కపనీ కావడం లేదు. పనులన్నవి ప్రజలకు సంబంధించినవి. కాంగ్రెస్ అధికారంలో ఉన్నంత మాత్రాన ప్రజల సమస్యలు పరిష్కరించకుండా ఉండడం దారుణం కాక మరోటి కాదు. ఇకపోతే కేంద్రమంత్రులుగా కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు కాంగ్రెస్‌ను తిడుతూ కూర్చోవడం తప్ప ఒక్కటంటే ఒక్కటి ప్రజలు గుర్తించే పనులు చేయడం లేదు. జూ÷–బలీహిల్‌లో అందుకే బిజెపి అడ్రస్ లేకుండా పోయింది. కేంద్రమంత్రిగా ఇది కిషన్ రెడ్డి సిగ్గుపడాల్సిన విషయం. 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి జూబ్లీహిల్స్‌లో వచ్చిన ఓట్లు 35 శాతం మాత్రమే. అప్పుడు బీఆర్ఎస్‌కు దాదాపు 44 శాతం ఓట్లు వచ్చాయి. అంటే, కాంగ్రెస్ కంటే దాదాపు 9 శాతం అధికం. గత ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీకి 14 శాతం పైగా ఓట్లు వచ్చాయి. ఇప్పుడు 9 శాతంలోపే. ఈసారి బీజేపీ డిపాజిట్ కూడా కోల్పోయింది. 2023 ఎన్నికలతో పోల్చితే కాంగ్రెస్ పార్టీకి దాదాపు పదహారుశాతం ఓట్లు పెరిగాయి. అప్పటితో పోలిస్తే బీఆర్ఎస్, బీజేపీలకు కలిపి 11 శాతం ఓట్లు తగ్గాయి. ఇవన్నీ కాంగ్రెస్‌కు బదిలీ అయ్యాయని భావించాలి. గత ఎన్నికల్లో మజ్లిస్ పోటీ చేయగా, ఇప్పుడు ఆ పార్టీ కాంగ్రెస్‌కు మద్దతు ప్రకటించింది. దీంతో మరో ఐదుశాతం ఓట్లు కాంగ్రెస్ కు కలిసి వచ్చాయి. అధికారంలో ఉన్న పార్టీలకు ఉప ఎన్నికల్లో కొన్ని అనుకూలతలు ఉంటాయి. వాటన్నింటినీ పరిగణనలోకి తీసుకున్నప్పటికీ కాంగ్రెస్ పార్టీకి 51 శాతం ఓట్లు లభించడం విశేషమే అని అంగీకరించాలి. ఉప ఎన్నికల్లో అధికార పార్టీకి ఐదు శాతం వరకు అనుకూలతల వల్ల లబ్ది చేకూరుతుంది. కాంగ్రెస్‌కు 16 శాతం వరకు పెరిగినందున ఆ విజయాన్ని గుర్తించవలసిందే. బిహార్ ఎన్నికల్లో అంచనాలకు మించి స్వీప్ చేసిన బీజేపీకి తెలంగాణలో ఈ పరిస్థితి ఎందుకు ఏర్పడిందో ఆ పార్టీ అధిష్ఠానం ఆలోచించు కోవాలి. ఉత్తరాదిన తిరుగులేని శక్తిగా ఎదిగిన బీజేపీ దక్షిణాదిలో ఎందుకు ఆపసోపాలు పడుతోందో ఆలోచించుకోవాలి. ఇక్కడ జనం నాడిని ఎందుకు అందుకోలేకపోతున్నారో ఆత్మపరిశీలన చేసుకోవాలి. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా తామే అధికారంలోకి వస్తామన్న అతి విశ్వాసంతో ఉన్న బీఆర్ఎస్‌కు జూబ్లీహిల్స్ ఫలితం గుణపాఠం కావాలి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని బీఆర్ఎస్ నాయకులు, ముఖ్యంగా కేటీఆర్ తక్కువగా అంచనా వేశారు. ఈ క్రమంలోనే ముఖ్యమంత్రిని కేటీఆర్ తరచుగా కించపరుస్తూ రెచ్చగొట్టారు. రాజకీయంగా ఉండాల్సిన వైరాన్ని వ్యక్తిగత వైరంగా మార్చారు. రేవంత్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గుర్తించడానికి కూడా బిఆర్ఎస్ నేతలు అంగీకరించడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో అంతులేని వ్యతిరేకత నిజమే అయితే జూబ్లీహిల్స్‌లో 51 శాతం ఓట్లు రావడం ఎలా సాధ్యం అని బీఆర్ఎస్ నాయకులు ఆత్మపరిశీలన చేసుకోవాలి. ఓటమి తరవాత కేసీఆర్ కుటుంబం ఇంకా నేల మీదకు దిగి రాలేదని గ్రహించాలి. కేసీఆర్ ఫామ్‌హౌజ్‌కే పరిమితం కావడంతో పార్టీలో అంతా తానే అన్నట్టుగా గత రెండేళ్లుగా కేటీఆర్ వ్యవహరిస్తున్నారు. అయినా ప్రజల అభిమానాన్ని మాత్రం ఆయన చూరగొనలేక పోతున్నారు. కేటీఆర్‌లో ఇంకా అహంభావం ఛాయలు పోలేదని ప్రజలు చర్చించుకుంటున్నారు. 2023 ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత



జరిగిన ఏ ఎన్నికల్లో కూడా బీఆర్ఎస్ గెలవలేదు. పార్లమెంటు ఎన్నికల్లో ఒక్క సీటు కూడా రాలేదు. కొన్నిచోట్ల పోటీ కూడా చేయలేదు. ఇప్పుడు జూబ్లీహిల్స్ ఎన్నిక. కర్మ మనల్ని వెంటాడుతుందని కేటీఆర్ సొంత చెల్లి కవిత తాజాగా వ్యాఖ్యానించారు. గతంలో అహంభావంతో వ్యవహరించినందునే ఇప్పటి దుస్థితి అని తెలుసుకోకుండా ఇప్పటికీ త్వరలోనే అధికారంలోకి వస్తాం, మీ సంగతి తేలుస్తాం అని ప్రగల్భాలు పుకుతున్నారు.